Janampower.in

TELTEL/2016/69862

# జనంపవర్

తెలుగు దినపత్రిక

JANAM POWER

కరీంనగర్ ఆదివారం 19.04.2026 సంపుటి : 14 సంచిక : 310 పేజీలు: 12 వెల: 5/-

Karimnagar Sunday 19.04.2026 Valume : 14 Issue : 310 Pages : 12 Cost: 5/-



Editor: BANDARI MARUTHI



## మహిళా బిల్లు అడ్డుకోవడం ముమ్మాటికి భ్రూణహత్యే

కాంగ్రెస్, ఎస్పీ, తృణమూల్, డీఎంకేలదే ఈ బాధ్యత

- కుటుంబ పార్టీలతో మహిళలకు న్యాయం జరగదు
- అన్ని రాష్ట్రాలకు సమన్యాయం జరిగేలా సవరణ బిల్లు తెచ్చాం
- రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని కాంగ్రెస్ దుష్ప్రచారం
- ఈ పాపం ఆ పార్టీలను వదిలి పెట్టదు.. మహిళా శక్తి ఊరుకోదు
- జాతిని ఉద్దేశించిన చేసిన ప్రసంగంలో మోడీ ఘాటు విమర్శలు

"భారత నారీశక్తి ఎదగకుండా కాంగ్రెస్ తదితర విపక్షాలు అడ్డుకున్నాయని ప్రధాని మోదీ ఆక్షేపించారు. భారత మహిళల కలలను ధ్వంసం చేశారని విమర్శించారు. 131వ రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో వీగిపోయిన నేపథ్యంలో.. దేశ ప్రజలను ఉద్దేశించి శనివారం మోదీ ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రధాని దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పారు. ఈ బిల్లును ఆమోదింపచేయకపోవడం తనకు బాధ కలిగించిందన్నారు. ఇది ముమ్మాటికీ భ్రూణ హత్యేనని అన్నారు. దేశ హితమే తమకు అత్యంత ముఖ్యమని, కొందరికి మాత్రం దేశం కంటే రాజకీయాలే ముఖ్యమని విమర్శించారు."

3



## రైతుభరోసా విడుదలకు సిద్ధం

రేపు కాటారాం సభలో విడుదల చేయనున్న రేవంత్

.. వివరాలు 2లో



## 26 వరకు వర్షాలు

ఈదురుగాలులతో కూడిన వానలు


పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్

వాతావరణ శాఖ వెల్లడి

.. వివరాలు 3లో

## బొమ్మ కార్లతో పేలుళ్లకు ప్లాన్

నలుగురు అనుమానితుల అరెస్టు



.. వివరాలు 3లో



# మహిళా రిజర్వేషన్‌లో చిత్తశుద్ధి లేదు

## బిల్లు ముసుగులో డీలిమిటేషన్ చట్టం

### దక్షిణాదిని దెబ్బతీసే కుట్రను అడ్డుకున్నాం

- చిత్తశుద్ధి ఉంటే కేవలం మహిళా బిల్లు తేవాలి
- అందుకు ఇండి కూటమి మద్దతు ఇస్తుంది
- బీజేపీతో జతకట్టిన పార్టీలకు ఎదురుదెబ్బలు తప్పవు
- తెలుగు దేశం పార్టీకి కూడా ఆ ప్రమాదం ఉంది
- మీడియా సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 18:** మహిళా బిల్లు పేరుతో డీలిమిటేషన్ బిల్లు తీసుకువచ్చారని కేంద్ర ప్రభుత్వంపై సీఎం రేవంత్‌రెడ్డి విమర్శలు గుప్పించారు. మహిళా బిల్లు వీగిపోవడంతో ప్రతిపక్షాలపై అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. మహిళల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ చాలా చేసిందని పేర్కొన్నారు. మహిళా బిల్లు వీగిపోవడం.. భాజపా విధానాల ఓటమిగా భావించాలి. ఈ బిల్లుపై ప్రధాని మోదీకి నిజాయతీ లేదు. నిజాయతీగా

మిగతా 2 లో



## బయ్యారంలో గ్రీన్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు

కుమారస్వామికి విజ్ఞప్తి చేసిన సీఎం రేవంత్

2

## హోర్ముజ్ జలసంధిలో హైటెన్షన్

భారత ట్యాంకర్‌పై ఇరాన్ సైన్యం కాల్పులు!

మళ్లీ మూతపడిన కీలక జలమార్గం..



4

## మహిళా బిల్లు పేరుతో డీలిమిటేషన్ కుట్ర

- డీలిమిటేషన్‌తో తమిళనాడు ప్రాధాన్యం తగ్గింపు
- అందుకే రాజ్యాంగ సవరణ బిల్లును అడ్డుకున్నాం
- తమిళనాడు ఎన్నికల ప్రచారంలో రాహుల్

4



## రాహుల్ గాంధీకి ఊరట

పౌరసత్వ వివాదంలో ఎఫ్ఐఆర్ నమోదుపై స్టే

4

## పులి వస్తే.. ఎన్ని మేకలను మింగిందో బయటపెడతాం!

- కాళేశ్వరంలో 'పులి' ఏం చేసిందో ప్రజలకు వివరిస్తాం
- 20న అన్ని విషయాలు వెల్లడిస్తాం
- కేసీఆర్ జగిత్యాల సభపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ సెటైర్లు
- మహిళా బిల్లు పతనం మోదీ అహంకారానికి చెంపపెట్టని విమర్శ





## ఆత్మగౌరవం దెబ్బతీసిన తేజస్వీసూర్య

- పెదవి విప్పని తెలంగాణ బీజేపీ, కాంగ్రెస్ ఎంపీ
- ఈ వ్యవహారాన్ని ఇంతటితో వదిలే ప్రసక్తి లేదు
- రాబోయేది బిఆర్ఎస్ ప్రభుత్వమే అన్న హరీష్ రావు
- రాజకీయ పునరేకీకరణ ప్రారంభమయ్యిందన్న కేటీఆర్
- జగిత్యాలలో కేసీఆర్ ఆశీర్వాద సభ ఏర్పాట్లు పరిశీలన

## కొత్త ఎయిర్‌పోర్ట్‌ల పనులు వేగవంతం చేయాలి

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశం
- విమానాశ్రయాలపై ఉన్నతస్థాయి సమీక్ష
- వరంగల్ ఎయిర్‌పోర్ట్‌కు 953 ఎకరాల భూసేకరణ పూర్తి
- ఆదిలాబాద్‌కు మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలని సూచన..
- కొత్తగూడెంపై నివేదిక కోరిన మంత్రి పొంగులేటి

రాష్ట్రాన్ని సమగ్ర అభివృద్ధి దిశగా ముందుకు తీసుకుని వెళ్లాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి నేతృత్వంలో ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఈ క్రమంలో వరంగల్, ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఎయిర్‌పోర్ట్‌ల నిర్మాణానికి ప్రభుత్వం కార్యాచరణను సిద్ధం చేసిందని అన్నారు.

2





# స్కూల్ పరిసరాల్లో సిగరెట్, గుట్కా నిషేధం

## పాన్ షాపుల్లో పోలీసుల తనిఖీలు..హెచ్చరిక

**హైదరాబాద్, ఏప్రిల్ 18:** ఆపరేషన్ సేఫ్ స్కూల్ పేరుతో విద్యాసంస్థల దగ్గర ఉండే పాన్ షాపుల వద్ద స్పెషల్ డ్రైవ్ నిర్వహించామని హైదరాబాద్ పోలీసు కమిషనర్ వీసీ సజ్జనార్ తెలిపారు. హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్,స్పెషల్ టీం, ఎచ్ న్యూ మొత్తం 5000 మంది సిబ్బంది ఈ రైడ్స్‌లో పాల్గొన్నారని పేర్కొన్నారు. విద్యాసంస్థలకు వంద మీటర్ల పరిధిలో ఉన్న 500కుపైగా పాన్ షాపుల్లో ముమ్మరంగా తనిఖీలు నిర్వహించామని తెలిపారు. విద్యాసంస్థలకు 100 మీటర్లలోపు పొగాకు ఉత్పత్తులు విక్రయించ కూడదని సీపీ సజ్జనార్ ఆదేశించారు. అలా విక్రయిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొందరు పాన్ షాప్ నిర్వాహకులపై కేసులు నమోదు చేశామని.. తీరు మార్చుకోకపోతే తీవ్రమైన చర్యలు ఉంటాయని వార్నింగ్ ఇచ్చారు. స్కూలు పరిసరాలు పొగాకు రహితంగా ఉండాలని సూచించారు. స్కూల్ పరిసరాల్లో పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తున్నారని తమకు పలు ఫిర్యాదులు అందుతున్నాయని ప్రస్తావించారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పిల్లల భవిష్యత్తుపై ఆందోళన చెంది తమకు ఫిర్యాదులు చేశారని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు. తమ పోలీస్ సిబ్బంది కూడా డికాయ్ ఆపరేషన్ నిర్వహించారని.. పొగాకు ఉత్పత్తులు స్కూల్ విద్యార్థులకు అమ్ముతున్నట్లు తమ విచారణలో తేలిందని చెప్పుకొచ్చారు. స్కూళ్ల వద్ద కొన్ని రోజుల నుంచి నిఘా పెట్టామని.. ఈరోజు ఐదు వేలమంది పోలీసులతో స్పెషల్ డ్రైవ్ నిర్వహించామని తెలిపారు. పొగాకు ఉత్పత్తులను విద్యార్థులు తీసుకోవడం మొదలుపెడితే.. డ్రగ్స్ వైపు మళ్లే అవకాశం ఉంటుందని అన్నారు. వారి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఈ స్పెషల్ డ్రైవ్ నిర్వహించామని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు. రాష్ట్రంలో బ్యాన్ అయిన పాన్ మసాలాలు, గుట్కాలు వంటివి ఎవరైనా అమ్ముతున్నారా అనే విషయాలపై ఆరా తీశారు. కొన్ని పాన్ షాపుల్లో నిబంధనలకు విరుద్ధంగా అమ్ముతున్న వస్తువులను సీజ్ చేశారు పోలీసులు. లోకల్ వస్తువులకు బ్రాండెడ్ ముద్ర వేసి అమ్ముతున్న కొన్నింటిని.. అదే విధంగా ఈ సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు పోలీసులు. నాంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని రెడ్ హిల్స్ లోని ఓ పాన్ షాపులో ఈ సిగరెట్లు, గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు పోలీసులు.

# తెలుగు రాష్ట్రాల నేతలకు కేంద్రమంత్రి అల్పాహార విందు

## హాజరైన సీఎం రేవంత్ సహా పలువురు నేతలు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 18:** తెలుగు రాష్ట్రాల నేతలకు ఆంధ్ర నుంచి కేంద్రమంత్రిగా ఉన్న భూపతిరాజు శ్రీనివాస వర్మ ఆతిథ్యం ఇచ్చారు. శనివారం ఉదయం తెలుగు రాష్ట్రాల నేతలకు కేంద్ర మంత్రి అల్పాహార విందు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ అల్పాహార విందులో ఎటువంటి రాజకీయ కోణం లేదని స్పష్టం చేశారు. డిసెంబర్ 9 నాటికి హైదరాబాద్ క్లీన్ అండ్ గ్రీన్‌గా ఉండాలని ఈవీ బస్సులు ఇవ్వాలని రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారని తెలిపారు. ఎలక్ట్రిక్ బస్సుల కేటాయింపులు చేశామని.. త్వరలో అందజేస్తామని చెప్పారు. మహిళా రిజర్వేషన్ 2029 నుంచి అమలు చేసేందుకు ఒక ప్రయత్నం చేశామని.. కానీ విపక్షాలు వ్యతిరేకించాయన్నారు. 2029 నుంచే మహిళా రిజర్వేషన్ అమలు కావాలని ఆశిద్దామని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ వెల్లడించారు. అల్పాహార విందుకు కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, కుమారస్వామి, పెమ్మసాని చంద్రశేఖర్, టీడీపీ ఎంపీలు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, తెలంగాణ బీజేపీ ఎంపీ లక్ష్మణ్ హాజరయ్యారు. ఏపీ మంత్రి పయ్యావుల కేశవ్, ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు కూడా ఈ విందులో పాల్గొన్నారు.

# ఐపీఎస్‌ల బదిలీ

## 9 మందికి కొత్త బాధ్యతలు!

### జిల్లా అదనపు ఎస్పీలుగా యువ అధికారులకు ప్రమోషన్లు

### తక్షణమే అమల్లోకి రానున్న ఉత్తర్వులు..

### జిల్లాల వారీగా కొత్త పోస్టింగ్‌లు

**హైదరాబాద్, ఏప్రిల్19:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ యంత్రాంగంలో కీలక మార్పులు చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా తొమ్మిది మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ సాధారణ పరిపాలన విభాగం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ముఖ్యంగా ఏఎస్పీలుగా ఉన్న పలువురు అధికారులకు పదోన్నతులు కల్పిస్తూ జిల్లా అదనపు ఎస్పీలుగా (అడ్మిన్) బాధ్యతలు అప్పగించింది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం.. ఆసిఫాబాద్ ఏఎస్పీగా విధులు నిర్వహిస్తున్న ఎస్. చిత్తరంజన్‌ను అదే జిల్లాకు అదనపు ఎస్పీగా (అడ్మిన్) నియమించారు. కామారెడ్డి ఏఎస్పీ బొక్కా చైతన్య రెడ్డి సంగారెడ్డి అదనపు ఎస్పీగా బదిలీ అయ్యారు. జంగావ్ ఏఎస్పీగా ఉన్న పందేరే చేతన్ నితిన్‌ను జగిత్యాల జిల్లా అదనపు ఎస్పీగా (అడ్మిన్) నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. భద్రాద్రి కొత్తగూడెం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్‌ను మెదక్ జిల్లాకు బదిలీ చేయగా, వరంగల్ ఏఎస్పీ నగ్రాలే శుభమ్ ప్రకాశ్‌ను నిజామాబాద్ జిల్లా అదనపు ఎస్పీగా (అడ్మిన్) నియమించారు. భైంసా ఎస్డీపీఓగా పనిచేస్తున్న రాజేష్ మీనా వనపర్తికి బదిలీ అయ్యారు. ఆదిలాబాద్‌లో ఉన్న మౌనికను అదే జిల్లాలో అదనపు ఎస్పీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. నిర్మల్ ఏఎస్పీ పథిపాక సాయికిరణ్‌ను భైంసా ఎస్డీపీఓగా, వేములవాడ ఏఎస్పీ రుత్విక్ సాయి కొట్టేను ఉట్నూరు ఎస్డీపీఓగా బదిలీ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ బదిలీలు తక్షణమే అమల్లోకి వస్తాయని, సంబంధిత అధికారులు వెంటనే తమ కొత్త బాధ్యతలను స్వీకరించాలని ప్రభుత్వం ఆదేశించింది. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ మరియు జిల్లా స్థాయి పోలీస్ పరిపాలనను మరింత బలోపేతం చేసే దిశగా ఈ మార్పులు జరిగినట్లు తెలుస్తోంది.

# మహిళా రిజర్వేషన్‌లో చిత్తశుద్ధి లేదు

మొదటి పేజీ తరువాయి

మహిళా రిజర్వేషన్ బిల్లు తీసుకువస్తే.. పార్లమెంట్‌లో అందరూ మద్దతు తెలిపేవారని అన్నారు. అయితే మహిళా బిల్లు పేరుతో డీలిమిటేషన్ బిల్లు తీసుకువచ్చి దక్షిణాదికి అన్యాయం చేయాలని చూశారు. ప్రధాని మోదీ.. ఉత్తర, దక్షిణ భారత్ మధ్య అంతరాలు సృష్టించే విధానాన్ని విరమించుకోవాలన్నారు. మహిళా రిజర్వేషన్ల బిల్లుపై మాకు చిత్తశుద్ధి ఉంది. 2023 నాటి మహిళా బిల్లును పార్లమెంట్‌లో పెట్టాలి. ఆ బిల్లు పెడితే మద్దతు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం. ఇందులోనూ ఎస్సీ, ఎస్టీ ఓబీసీ రిజర్వేషన్లు అమలు చేయాలి. మహిళా రిజర్వేషన్ల బిల్లు విషయంలో రాజకీయం చేయాల్సిన అవసరం లేదని సీఎం రేవంత్ అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రధాని నరేంద్ర మోదీ సర్కార్ నిజాయితీగా తీసుకురాలేదని రేవంత్ రెడ్డి అన్నారు. మూడు బిల్లుల పేరుతో డీలిమిటేషన్ అమలుకు కుట్ర చేశారని ఆరోపించారు. రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ కుట్ర చేసిందని.. దక్షిణాదికి జరిగే అన్యాయాన్ని లోక్ సభ సాక్షిగా అడ్డుకున్నామని పేర్కొన్నారు. విపక్షాల ఐక్యతతో మోదీ సర్కార్ ఓడిపోయిందన్నారు. ఇది రాజకీయ ఓటమి కాదని, బీజేపీ విధానాల ఓటమి అంటూ వ్యాఖ్యానించారు. మహిళా రిజర్వేషన్ల బిల్లు ఇప్పటికే పాసైందని.. చిన్న సవరణలతో రిజర్వేషన్లు అమలు చేయవచ్చని రేవంత్ అన్నారు. రిజర్వేషన్లు తొలగించేందుకే బీజేపీ కుట్ర చేసిందని.. బీజేపీకి 400 సీట్లు వచ్చి ఉంటే రాజ్యాంగాన్ని



మార్చేవారని తీవ్రంగా మండిపడ్డారు. విపక్షాలపై బురద జల్లేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని విమర్శించారు. 2023 మహిళా బిల్లును యథాతథంగా అమలు చేయాలని బీజేపీకి సూచించారు. అలా చేస్తే ఇండి కూటమి ఏకగ్రీవంగా మద్దతు ఇచ్చేందుకు సిద్ధమని ఆయన పేర్కొన్నారు. దక్షిణాది రాష్ట్రాలను ఒప్పించి తీసుకువచ్చే బాధ్యత తనదని ఈ సందర్భంగా రేవంత్ హామీ ఇచ్చారు. మహిళా రిజర్వేషన్లపై తమకు చిత్తశుద్ధి ఉందని, యూపీ ఎన్నికల్లోపు వాటిని అమలు చేయాలని ముఖ్యమంత్రి డిమాండ్ చేశారు. దీంతో ప్రజల్లో ఎవరికి మద్దతు ఉందో ప్రజాక్షేత్రంలోనే తేలుతుందని రేవంత్ రెడ్డి సవాల్ చేశారు. బిల్లును అడ్డుకోకుంటే డీలిమిటేషన్ పేరుతో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేసేవారని ధ్వజమెత్తారు. నార్త్, సౌత్ మధ్య అంతరాలు పెట్టే విధానం ఇకనైనా మార్చుకో వాలని బీజేపీకి సీఎం రేవంత్ రెడ్డి హితవుపలికారు. ఇకపోతే బీజేపీతో పొత్తు పెట్టుకున్న పార్టీల మనగడ భవిష్యత్తులో కష్టంగా ఉంటుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. తెలుగుదేశం, చంద్రబాబు నాయుడు పరిస్థితి కూడా అలాగే అవుతుందని పేర్కొన్నారు. నితీశ్ కుమార్, ఏక్ నాథ్ షిండేలా పరిస్థితి మనం ఇప్పుడు చూస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం బీజేపీకి కేంద్రంలో సీట్లు తక్కువగా ఉన్నాయి కాబట్టి టీడీపీకి ఇంపార్టెన్స్ ఇస్తోందని పేర్కొన్నారు. లోక్‌సభ, రాజ్యసభ ఉన్నది చట్టాలు చేయడానికి మాత్రమేనని చెప్పుకొచ్చారు. వాటిని ఇంప్లిమెంట్ చేసేది స్థానికంగా ఉండే రాష్ట్ర ప్రభుత్వాలు అధికార యంత్రాంగమని తెలిపారు. 2/3 మెజార్టీ వచ్చినంత మాత్రాన అన్నింటిని చట్టాలు చేయలేమని పేర్కొన్నారు. కేంద్రంలో మెజార్టీ ఉందని ప్రధానిగా ఉన్న ఎవరైనా తనకు తనకు రాజుగా 2/ 3 మెజార్టీతో చట్టం చేసుకుంటే ఒప్పుకోరు కదా అని ప్రశ్నించారు. డిక్టేటర్‌షిప్‌ని ఎవరు ఒప్పుకోరని చెప్పారు. ఏపీలో ప్రతిపక్షానికి కేవలం 11 సీట్లే ఉన్నాయని తెలిపారు. 2011 జనాభా లెక్కల ప్రకారం మహిళలకు రిజర్వేషన్ కల్పించాలని సీఎం రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు.

# బయ్యారంలో గ్రీన్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు

- కుమారస్వామికి విజ్ఞప్తి చేసిన సీఎం రేవంత్
- ప్రియాంకను కలిసి బిల్లును ఓడించినందుకు అభినందనలు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 18:** కేంద్ర మంత్రులు కుమారస్వామి, శ్రీనివాసవర్మను సీఎం రేవంత్‌రెడ్డి కలిశారు. బయ్యారంలో గ్రీన్ స్టీల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని కుమారస్వామికి విజ్ఞప్తి చేశారు. దీని ద్వారా ఉక్కు కొరత తగ్గడంతోపాటు.. పర్యావరణానికి మేలు జరుగుతుందని తెలిపారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌లో భాగంగా రూపొందించిన పారిశ్రామిక ప్రతిపాదనలను సీఎం వివరించారు. పాత వాహనాల స్క్రాప్‌ను రీసైక్లింగ్ చేసే పరిశ్రమను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈవీ బ్యాటరీల తయారీ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. హైదరాబాద్‌ను కాలుష్యం లేని నగరంగా మార్చేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో బిజీబిజీగా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామితో సమావేశమయ్యారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా బయ్యారంలో గ్రీన్ స్టీల్ ప్లాంట్ నెలకొల్పాలని విజ్ఞప్తి చేశారు. హైడ్రోజన్ టెక్నాలజీతో గ్రీన్ స్టీల్ క్లస్టర్ ఏర్పాటుకు ప్రతిపాదన చేశారు. పాత వాహనాల స్క్రాప్‌తో ఉక్కును రీసైక్లింగ్ చేసే పరిశ్రమను తెలంగాణలో ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్ర పారిశ్రామిక విజన్ డాక్యుమెంట్‌ను కేంద్ర మంత్రికి సీఎం వివరించారు. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరుగుతున్న దృష్ట్యా ఈవీ బ్యాటరీ తయారీ కేంద్రం ఏర్పాటుకు విన్నవించారు. ఆటో, రక్షణ రంగాల ఉత్పత్తులు, రోబోటిక్స్ తయారీకి ప్రత్యేక పార్కుల కోసం ప్రతిపాదించారు ముఖ్యమంత్రి. 2034 నాటికి హైదరాబాద్‌ను కాలుష్య రహిత నగరంగా మార్చేందుకు కేంద్రం సహకారం కోరారు. ఆధునిక పరిశ్రమలకు అనుగుణంగా జాతీయ స్థాయి స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థలను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రి కుమార స్వామికి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. అలాగే వయనాడ్ ఎంపీ, కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం ఉదయం సమావేశమయ్యారు. 131వ రాజ్యాంగ సవరణ బిల్లును ఓడించినందుకు ప్రియాంకకు సీఎం ధన్యవాదాలు తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లు వెనుక ఉన్న అసలు విషయాలను ప్రియాంక



గాంధీ బయటపెట్టారని ముఖ్యమంత్రి అన్నారు. తెలంగాణ ప్రజల తరఫున రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేకు ధన్యవాదాలు తెలియజేశారు. 'దక్షిణాది రాష్ట్రాలను ఏకీకృతం చేయడంలో నా కృషిని ప్రియాంక గాంధీ అభినందించారు' అని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు.




# రెండోవిడత రైతుభరోసా విడుదలకు సిద్ధం

## రేపు కాటారాం సభలో విడుదల చేయనున్న రేవంత్

**హైదరాబాద్, ఏప్రిల్ 18:** తెలంగాణ రైతులకు ప్రభుత్వం శుభవార్త తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'రైతు భరోసా'పథకం రెండో విడత నిధుల విడుదలకు ముహూర్తం ఖరారైంది. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది రైతులకు పెట్టుబడి సాయం అందనుంది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు సంక్షేమమే ధ్యేయంగా కీలక నిర్ణయం తీసుకున్నారు. వానాకాలం సాగుకు అన్నదాతలు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో రైతు భరోసా నిధులు విడుదల చేయాలని సీఎం నిర్ణయించారు. భూపాలపల్లి జిల్లా కాటారంలో ఈనెల 20వ తేదీన నిర్వహించనున్న భారీ బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఈ నిధులను విడుదల చేయనున్నారు. బటన్ నొక్కి నేరుగా రైతుల బ్యాంక్ ఖాతాల్లోకి నగదును జమ చేయనున్నారు. రెండో విడత నిధుల విడుదల ద్వారా రాష్ట్రంలోని మెజారిటీ రైతులకు లబ్ది చేకూరనుంది. ప్రతి ఎకరానికి రూ. 6,000 చొప్పున పెట్టుబడి సాయం అందనుంది. ఈ విడతలో 45,11,947 మంది రైతులకు ప్రయోజనం చేకూరనుంది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.50 కోట్ల ఎకరాలకు ఈ సాయం వర్తించనుంది. ప్రభుత్వం రైతు భరోసా కోసం భారీగా నిధులను వెచ్చిస్తోంది. దీనికి సంబంధించిన గణాంకాలు కింది విధంగా ఉన్నాయి. ఇప్పటికే ప్రభుత్వం రూ. 3,590 కోట్లను రైతుల ఖాతాల్లో సక్సెస్‌ఫుల్‌గా జమ చేసింది. 20వ తేదీన రూ. 5,653 కోట్లు జమ కానున్నాయి. మొత్తం 73 లక్షల మంది రైతులకు ఈ పథకం ద్వారా ప్రయోజనం చేకూరనుంది. మిగిలిన రైతుల కోసం మూడో విడత నిధులను విడుదల చేయడానికి కూడా ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించింది. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసే సమయంలో ఈ నగదు అందడం వల్ల రైతన్నలకు వడ్డీ వ్యాపారుల భారం తప్పుతుంది. నిధులు సకాలంలో అందడం వల్ల అన్నదాతలు సాగు పనులను వేగవంతం చేసే అవకాశం ఉంటుంది. తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చే క్రమంలో రైతు భరోసా నిధుల విడుదలకు ప్రాధాన్యం ఇస్తోంది. కాటారం సభ వేదికగా జరగనున్న ఈ కార్యక్రమం రాష్ట్ర వ్యవసాయ రంగంలో కొత్త ఉత్సాహాన్ని నింపనుంది.

# కొత్త ఎయిర్‌పోర్ట్‌ల పనులు వేగవంతం చేయాలి

## మంత్రి పొంగులేటి ఆదేశం.. విమానాశ్రయాలపై ఉన్నతస్థాయి సమీక్ష

### వరంగల్ ఎయిర్‌పోర్ట్‌కు 953 ఎకరాల భూసేకరణ పూర్తి.. త్వరలోనే శంకుస్థాపన

### ఆదిలాబాద్‌కు మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలని సూచన..

### కొత్తగూడెంపై నివేదిక కోరిన మంత్రి

**హైదరాబాద్, ఏప్రిల్ 18:** తెలంగాణ రాష్ట్రాన్ని సమగ్ర అభివృద్ధి దిశగా ముందుకు తీసుకుని వెళ్లాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఈ క్రమంలో వరంగల్, ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఎయిర్‌పోర్ట్‌ల నిర్మాణానికి ప్రభుత్వం కార్యాచరణను సిద్ధం చేసిందని అన్నారు. ఈ ప్రాజెక్ట్‌ల నిర్మాణం వీలైనంత త్వరగా ప్రారంభించేందుకు అవసరమైన భూ సేకరణ, సాంకేతిక అనుమతులు, మౌలిక వసతుల ఏర్పాటుకు చర్యలు వేగవంతం చేస్తున్నట్లు వెల్లడించారు. శనివారం సచివాలయంలోని తన కార్యాలయంలో ఎయిర్‌పోర్ట్ అథారిటీ సదరన్ రీజియన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజ్ కిషోర్, ఏవియేషన్ డైరెక్టర్ భరత్‌రెడ్డి తదితరులతో కలిసి వరంగల్, ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో తెలంగాణ ప్రభుత్వం నిర్మించతలపెట్టిన ఎయిర్ పోర్ట్‌లపై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ కేందప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ పనులను త్వరితగతిన ముందుకు తీసుకువెళ్లాలని సూచించారు. వరంగల్ ఎయిర్ పోర్ట్‌కు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే సుమారు 953 ఎకరాల భూమిని సేకరించి కేంద్రానికి అప్పగించిందని తెలిపారు. వీలైనంత త్వరలో శంకుస్థాపన చేస్తామని వెల్లడించారు. అలాగే ఆదిలాబాద్ విమానాశ్రయాన్ని డిఫెన్స్ (రక్షణ శాఖ) సివిల్ ఏవియేషన్ (పౌర విమానయాన శాఖ) , తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించాయని ఇందుకు సంబంధించి మాస్టర్ ప్లాన్ తక్షణమే సిద్ధం చేయాలని సూచించారు. ఈ ఎయిర్ పోర్ట్‌కు అవసరమైన భూ సేకరణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ విమానాశ్రయం అందుబాటులోకి వస్తే ఉత్తర తెలంగాణలో రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గతంలో ప్రతిపాదించిన స్థలం విమానాశ్రయ నిర్మాణానికి అనుకూలంగా లేదని కేంద్ర పౌర విమానయాన శాఖ తెలిపిన నేపథ్యంలో దీనిపై మరింత లోతైన అధ్యయనం చేసి సాధ్యాసాధ్యాలపై ఒక నివేదిక రూపొందించాలని సూచించారు.



# తెలంగాణ ఆత్మగౌరవం దెబ్బతీసిన తేజస్వీసూర్య

- పెదవి విప్పని తెలంగాణ బీజేపీ, కాంగ్రెస్ ఎంపీ
- ఈ వ్యవహారాన్ని ఇంతటితో వదిలే ప్రసక్తి లేదు
- రాబోయేది బిఆర్ఎస్ ప్రభుత్వమే అన్న హరీష్ రావు
- రాజకీయ పునరేకీకరణ ప్రారంభమయ్యిందన్న కేటీఆర్
- జగిత్యాలలో కేసీఆర్ ఆశీర్వాద సభ ఏర్పాట్లు పరిశీలన



**జగిత్యాల, ఏప్రిల్ 18:** బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య లోక్సభలో చేసిన వ్యాఖ్యలు తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఉన్నాయని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. ఈ నెల 20న జగిత్యాలలో నిర్వహించనున్న కేసీఆర్' ప్రజా ఆశీర్వాద సభ' ఏర్పాట్లను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్తో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీష్రావు మాట్లాడారు. బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలకు తెలంగాణ ఎంపీ, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సపోర్టుగా నిలిచారని ఆరోపించారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని కించపరిచేలా మాట్లాడితే తెలంగాణలో 8 మంది బీజేపీ, 8 మంది కాంగ్రెస్ ఎంపీలు ఉన్నా ఏం లాభమని అన్నారు. బీజేపీ ఎంపీ బేషరతుగా తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఆత్మగౌరాన్ని దెబ్బ తీసిన ఎంపీ విషయంలో బీఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదని వెల్లడించారు. బడేబాయి, చోటే బాయి బంధం మరో సారి బయటపడిందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఎంపీలు పార్లమెంట్లో లేని లోటు నిన్న స్పష్టంగా కన్పించిందని హరీష్రావు వెల్లడించారు. తెలంగాణ ఉద్యమం, ప్రజల మీద విషం చిమ్మే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. భారత్ - పాక్ విభజనతో తెలంగాణ ఏర్పాటును పోల్చుతారా అంటూ మాజీ మంత్రి మండిపడ్డారు. ఇది తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బ తీసిందన్నారు. పార్లమెంట్లో బిల్లు పాస్ అయి.. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయ్యిందని హరీశ్ రావు తెలిపారు. ఎంపీ తప్పు మాట్లాడితే.. క్షమాపణ చెప్పాల్సింది పోయి వెనుకేసుకుని వస్తున్నారని మండిపడ్డారు. లోక్ సభలో బీఆర్ఎస్ ఎంపీలు లేని లోటు తెలుస్తోందన్నారు. బీజేపీ ఎంపీ వ్యాఖ్యలపై కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు పెదవులు మూసుకుని కూర్చున్నారని మండిపడ్డారు. తేజస్వి సూర్య మూతి పగిలే సమాధానం చెప్పలేకపోయారని అన్నారు. తెలంగాణ ప్రజల మనోభావాలను గాయపరిచారన్నారు. మహిళా బిల్లు విషయంలో కాంగ్రెస్, బీజేపీ పార్టీలు నాటకామాడుతున్నాయని విమర్శించారు. ఎంపీ తేజస్వి యాదవ్ వ్యాఖ్యలను సీఎం రేవంత్ ఇప్పటి వరకు ఖండించలేదని,రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం రాబోతుందని, దానికి నిదర్శనం బీఆర్ఎస్లో జీవన్ రెడ్డి చేరిక అని స్పష్టం చేశారు. రాజకీయల్లో విలువలతో కూడిన రాజకీయం చేసిన వ్యక్తి జీవన్ రెడ్డి అని కొనియాడారు.మహిళా బిల్లును డీలిమిటేషన్తో ఎందుకు ముడి పెట్టారని ప్రశ్నించారు. మెజారిటీ లేకున్నా బిల్లు పెడతారా అని నిలదీస్తూ.. రాజకీయం కోసమే బిల్లు ప్రవేశపెట్టారని మాజీ మంత్రి హరీశ్ రావు వ్యాఖ్యలు చేశారు. మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు టి.జీవన్ రెడ్డి బీఆర్ఎస్లో చేరబోతున్న సందర్భంగా జిల్లాలో పండుగ వాతావరణం కనిపిస్తుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఈ నెల 20న జగిత్యాలలో జరగనున్న కేసీఆర్ ' ప్రజా ఆశీర్వాద సభ' ఏర్పాట్లను మాజీ మంత్రి హరీష్రావు, కొప్పుల ఈశ్వర్ , ఎమ్మెల్సీ రమణ, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి తదితరులతో కలిసి పరిశీలించారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో రాజకీయ పునారేకీకరణ జరుగుతుందని వెల్లడించారు. జగిత్యాల నుంచి బీఆర్ఎస్ జైత్రయాత్ర ప్రారంభం అవుతుందని, జగిత్యాల నుంచి బీఆర్ఎస్ పార్టీకి పూర్వ వైభవం వస్తుందని దీమాను వ్యక్తం చేశారు.కేసీఆర్ బయటకు వస్తే గుంట నక్కలు బయపడుతున్నాయని పేర్కొన్నారు.కేసీఆర్ జగిత్యాలలో సభ ఉంటే మేడి గడ్డలో రేవంత్ సభ ఏర్పాటు చేసుకున్నాడని విమర్శించారు. రేవంత్ హైట్లో చిన్న అనుకున్న. కానీ రేవంత్ది చిన్న మెదడని, ఇక్కడ ఉన్న ఎమ్మెల్యే హై బ్రిడ్, క్రాస్ బ్రిడ్ ఎమ్మెల్యేనా అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసిన కేసీఆర్ సభ విజయవంతమవుతుందని, కేసీఆర్ సీఎం కావడం ఖాయమని అన్నారు. ఈనెల 20న కేసీఆర్ సాయంత్రం 5,30 నిముషాలకు చేరుకుంటారని వివరించారు. సుమరు గంట సేపు కేసీఆర్ సభ ఉంటుందని కేటీఆర్ వెల్లడించారు.



# మహిళా బిల్లుపై నిరసనలకు పిలుపు

## బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు గృహ నిర్బంధం

**హైదరాబాద్, ఏప్రిల్ 18:** తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావును పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఇంటిని ముట్టడించేందుకు పిలుపునివ్వడంతో శనివారం ఉదయాన్నే రాంచందర్ రావు ఇంటికి వెళ్లిన పోలీసులు గుహ నిర్బంధం చేశారు. లోక్ సభలో శుక్రవారం మహిళా రిజర్వేషన్ బిల్లును కాంగ్రెస్ అడ్డుకుందంటూ రేవంత్ ఇంటి ముట్టడికి బీజేపీ సిద్ధమైంది. దీంతో పోలీసులు రంగంలోకి దిగారు. మ-రోవైపు పోలీసులు తనను నిర్బంధించడంపై ఆయన ఆగ్రహించారు. నారీ శక్తికి ద్రోహం చేసిన కాంగ్రెస్ను వదిలిపెట్టేది లేదని రాంచందర్ రావు హెచ్చరించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు మాట్లాడారు. కాంగ్రెస్ వైఖరికి నిరసనగా ఈరోజు దేశ వ్యాప్త ఆందోళనకు పిలుపునిచ్చామన్నారు. పోలీసులు తనను హౌస్ అరెస్ట్ చేశారని, అయినా తమ పార్టీ శ్రేణులు, నాయకులు రేవంత్ రెడ్డి ఇంటిని ముట్టడిస్తారని హెచ్చరించారు. దేశంలో ఇంకా రాచరిక పాలన కావాలని కాంగ్రెస్ భావిస్తోందని మండిపడ్డారు. ఒక్క ముస్లిం సమాజానికి మేలు చేసేందుకు ఈ డ్రామా ఆడుతున్నారని ఆరోపించారు. దేశ ప్రజలు, తెలంగాణ సమాజం కాంగ్రెస్ పార్టీకి తగిన విధంగా బుద్ధి చెప్పాలని అన్నారు.

# రాష్ట్రంలో 26 వరకు వర్షాలు

## ఈదురుగాలులతో కూడిన వానలు..

## పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్

## వాతావరణ శాఖ వెల్లడి

**హైదరాబాద్, ఏప్రిల్18:** ఎండలతో అల్లాడుతున్న తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ చల్లని కబురు చెప్పింది. రాష్ట్రంలో ఈనెల 26వ తేదీ వరకు పలుచోట్ల వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఉపరితల ఆవర్తనంతో పాటు క్యుములోనింబస్ మేఘాలు ఏర్పడటం వల్ల ఈ వర్షాలు కురుస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. వర్షం కురిసే సమయంలో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్ మరియు కామారెడ్డి జిల్లాల్లో వానలు పడతాయని తెలిపారు. గాలిలో తేమ శాతం పెరగడం, మేఘాల కదలికల వల్ల ఆయా ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు తగ్గే అవకాశం ఉంది. అలాగే, రాష్ట్రవ్యాప్తంగా వాతావరణంలో చోటుచేసుకున్న ఈ మార్పులు కేవలం ఒక రోజుకే పరిమితం కాకుండా, నేడు కూడా కొనసాగుతాయని వాతావరణ శాఖ ప్రకటించింది. రేపు కూడా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురుస్తాయని పేర్కొన్నారు. అకాల వర్షాల నేపథ్యంలో రైతులు తమ ధాన్యం మరియు పంటల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.



# కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉద్యోగుల ఉసురు తప్పదు

## ఉద్యోగుల జీతభత్యలు సకాలంలో ఇవ్వడం లేదు

## పెన్షనర్లకు సకాలంలో అందని బకాయిలు

## ఐదు డీఏలు పెండింగ్లోనే ఉన్నాయి

## ఉద్యోగ సంఘాల జేఏసీ మాజీ నేత జి దేవీ ప్రసాద్



**హైదరాబాద్, ఏప్రిల్ 18:** తెలంగాణలో ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులను ఇబ్బందుల పాలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉసురు తగులుతుందని ఉద్యోగ సంఘాల జేఏసీ మాజీ నేత, జి దేవీ ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం తెలంగాణ భవన్లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చిందని, ఏ ఒక్క హామీ అమలుకు నోచుకోలేదని ఆరోపించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఉద్యోగులకు 5 డీఏలు పెండింగ్లో ఉన్నాయని, సీపీఎస్ రద్దుపై ఇప్పటి వరకు కమిటీ వేయలేదని విమర్శించారు. ఉద్యోగులకు డిజిటల్ హెల్త్ కార్డులు ఏమయ్యాయని ప్రశ్నించారు. రిటైర్డ్ ఉద్యోగులు 86 మంది చనిపోయారని, రిటైర్డ్ ఉద్యోగులకు చావు పరిష్కారం అయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు ఉద్యోగులకు ఇవ్వాల్సిన రూ. 14 వేల కోట్లు పెండింగ్ లో ఉన్నాయని తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగుకు హైకోర్టు మెట్లు ఎక్కాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల చనిపోయిన రిటైర్డ్ ఉద్యోగులకు కోటి 20 లక్షల నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల్లో ఆంధ్రా పెత్తనం నడుస్తోందని, ఎక్సైజ్ శాఖలో కమీషనర్ వేధింపులు తట్టుకోలేక తెలంగాణ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం చేశారని వెల్లడించారు. చంద్రబాబు, రేవంత్ రెడ్డి మధ్య సోదర బంధం ఉందని, బీజేపీ రాజకీయంతోనే మహిళా రిజర్వేషన్ల అమలు బిల్లు ఆగిపోయింది డీలిమిటేషన్, మహిళా బిల్లును లింక్ చేశారని ఆరోపించారు. టీజీపీఎస్సీ మాజీ సభ్యురాలు సుమిత్రానంద్ మాట్లాడుతూ 30 ఏళ్లుగా మహిళా బిల్లును కాంగ్రెస్, బీజేపీ అడ్డుకుంటున్నాయని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్ల అమలు కావడం బీజేపీకి ఇష్టం లేదని అన్నారు. ఉపాధ్యాయ సంఘం మాజీ నాయకులు భుజంగ రావు తదితరులు మీడియా సమావేశంలో పాల్గొన్నారు.

# డీలిమిటేషన్‌కు మహిళా బిల్లు ముసుగు

## దక్షిణాదిని దెబ్బతీసే కుట్ర విఫలం

## బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**హైదరాబాద్, ఏప్రిల్ 18:** నియోజకవర్గాల పునర్విభజన కోసం కేంద్రం ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు పార్లమెంట్లో దక్షిణ భారతదేశ ప్రాధాన్యాన్ని తగ్గిస్తుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంటు ఇప్పటికే 2023లో ఆమోదించిందని, ఆ బిల్లుకు నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియతో ముడిపెట్టాల్సిన అవసరమే లేదని వ్యాఖ్యానించారు. నియోజక వర్గాల పునర్విభజనకు 2011 జనాభా లెక్కలను పరిగణలోకి తీసుకున్నా, తాజా జనాభా గణనను ప్రాతిపదికగా తీసుకున్నా దక్షిణ భారతదేశం తీవ్రంగా నష్టపోతుందని కేటీఆర్ అన్నారు. ఈ విషయం కేంద్రంలోని పాలకులకు కూడా బాగా తెలుసని చెప్పారు. రాజ్యాంగ సవరణకు అవసరమైన మూడింట రెండు వంతుల మెజారిటీని తాజా బిల్లు పొందలేదని స్పష్టంగా తెలిసినప్పటికీ, మోదీ ప్రభుత్వం బిల్లును ప్రవేశపెట్టిందని విమర్శించారు. పార్లమెంటులో దక్షిణ భారతదేశ గళాన్ని అణచివేస్తున్న తీరుపై బిఆర్ఎస్ తరపున తాము తీవ్ర ఆందోళనను, నిరసనను వ్యక్తంచేస్తున్నామని కేటీఆర్ చెప్పారు. మహిళా రిజర్వేషన్లకు సంబంధించిన బిల్లు ఇప్పటికే ఆమోదం పొందింది కాబట్టి, ఈ దేశ మహిళలకు ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. మహిళా రిజర్వేషన్ను అమలు చేయాలనుకుంటే ప్రస్తుతం ఉన్న 543 స్థానాలతోనే అమలు చేయవచ్చని చెప్పారు. పార్లమెంటులో దక్షిణ భారతదేశానికి ప్రస్తుతం 24? స్థానాలు ఉన్నాయని, ఆ 24 శాతం స్థానాలు యథాతథంగా కొనసాగేలా చూడాలని అన్నారు. ఒకవేళ దక్షిణ భారత ప్రాధాన్యాన్ని 24 శాతం కంటే తగ్గిస్తే ఈ దేశ నిర్మాణంలో విశేష కృషిచేసిన దక్షిణ భారత ప్రజల నుంచి తీవ్రమైన నిరసనలు, ఆగ్రహం వ్యక్తమవుతాయని కేటీఆర్ హెచ్చరించారు.

# 20నుంచి 26 వరకు వెల్ఫేర్ వీక్

**హైదరాబాద్, ఏప్రిల్18 :** 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 20 నుండి ఏప్రిల్ 26 వరకు రాష్ట్రవ్యాప్తంగా 'వెల్ఫేర్ వీక్' నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు తెలిపారు. ఈ సందర్బంగా కార్యక్రమం అమలు తీరుపై ఆయన శనివారం సచివాలయం నుండి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ ఈసందర్భంగా స్పెషల్ చీఫ్ సెక్రెటరీ సబ్యసాచి ఘోష్ రోజువారీ షెడ్యూల్ను వివరించారు జిల్లా కలెక్టర్లు ప్రతి కార్యక్రమం అమలును క్షుణ్ణంగా పర్యవేక్షించి సమగ్ర నివేదికను ప్రభుత్వానికి అందించాలని ఘోష్ సూచించారు. ప్రజాప్రతినిధు లను అన్ని కార్యక్రమాల్లో చురుకుగా భాగస్వామ్యం చేయాలని, తద్వారా విస్తృత ప్రచారం, పారదర్శకత పెరుగుతుందని ప్రణాళిక కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ తెలిపారు. ప్రభుత్వ ప్రధాన పథకాలు సంక్షేమ కార్యక్రమాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలని అన్నారు. వ్యవసాయ కార్యదర్శి సురేంద్ర మోహన్, ప్రియాంక, ఇతర అధికారులు వీడియో కాన్ఫరెన్స్లో పాల్గొన్నారు.

# పులి వస్తే.. ఎన్ని మేకలను మింగిందో బయటపెడతాం!

- కాళేశ్వరంలో 'పులి' ఏం చేసిందో ప్రజలకు వివరిస్తాం
- 20న అన్ని విషయాలు వెల్లడిస్తాం
- కేసీఆర్ జగిత్యాల సభపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ సెటైర్లు
- మహిళా బిల్లు పతనం మోదీ అహంకారానికి చెంపపెట్టని విమర్శ

**హైదరాబాద్, ఏప్రిల్ 18:** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జగిత్యాలలో నిర్వహించనున్న సభపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. శనివారం గాంధీభవన్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ను 'పులి'గా అభివర్ణించే వారిపై విమర్శలు గుప్పించారు. "పులి బయటకు వస్తే.. ఆ పులి ఎన్ని మేకలను మింగిందో, ఎన్ని ఆవులను తిన్నదో మేం బయటపెడతాం. ఆ పులి ఆసరా చూసుకుని ఎన్ని పిల్లులు లాభపడ్డాయో కూడా వివరిస్తాం" అంటూ ఘాటుగా హెచ్చరించారు. ముఖ్యంగా కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో జరిగిన పరిణామాలను ప్రస్తావిస్తూ, ఈ నెల 20వ తేదీన అన్ని విషయాలను ప్రజల ముందు ఉంచుతామని స్పష్టం చేశారు.

## బీజేపీ ఎంపీలు 'యాక్సిడెంటల్' లీడర్లు

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై కూడా మహేశ్ కుమార్ గౌడ్ విరుచుకుపడ్డారు. స్వాతంత్ర్య పోరాటంలో బీజేపీ పాత్రే లేదని, ఆ పార్టీ ఎంపీలంతా 'యాక్సిడెంటల్ లీడర్లు' అని ఎద్దేవా చేశారు. మతాల మధ్య, కులాల మధ్య చిచ్చు పెట్టడం తప్ప వారికి ఏమీ తెలియదని మండిపడ్డారు. "కర్ణాటక ఎంపీ (తేజస్వీ సూర్య) తెలంగాణను కించపరుస్తూ మాట్లాడుతుంటే రాష్ట్ర బీజేపీ ఎంపీలు నిద్రపోతున్నారా?" అని నిలదీశారు. నలభై ఏళ్ల రాజకీయ జీవితంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కనీసం ఒక్క బీసీ నాయకుడినైనా తయారు చేశారా? అని ప్రశ్నించారు. పార్లమెంటులో 131వ రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోవడం ప్రధాని నరేంద్ర మోదీ అహంకారానికి చెంపపెట్టు వంటిదని మహేశ్ గౌడ్ అభివర్ణించారు. మహిళా రిజర్వేషన్ల ముసుగులో నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) చేసి, ఉత్తర భారతదేశానికి సీట్లు పెంచాలనే కుట్రను ప్రతిపక్షాలు సమర్థవంతంగా అడ్డుకున్నాయని చెప్పారు.



మనువాద భావజాలం ఉన్న బీజేపీకి మహిళా సాధికారతపై చిత్తశుద్ధి లేదని, దేశానికి తొలి మహిళా ప్రధానిని, రాష్ట్రపతిని అందించిన ఘనత కాంగ్రెస్‌దేనని గుర్తు చేశారు.

## కిషన్ రెడ్డికి సవాల్

ఎన్నికల సమయంలో మాత్రమే బీజేపీ నేతలకు దేవుడు గుర్తుకొస్తారని మహేశ్ కుమార్ గౌడ్ విమర్శించారు. "జై శ్రీరామ్ అనకుండా తాను చేసిన అభివృద్ధిపై ప్రచారం చేసుకుని కిషన్ రెడ్డి గెలవగలరా?" అని సవాల్ విసిరారు. దేవుడి పేరు చెబితే ఓట్లు రాలే పరిస్థితి ఇప్పుడు లేదని, ప్రజలు అన్నీ గమనిస్తున్నారని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ కులగణన చేపట్టిందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో 50 శాతం సీట్లు బీసీలకే కేటాయించామని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

# మహిళలను ఏకం చేస్తాం : లక్ష్మణ్



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 18:** రాజ్యాంగ సవరణ బిల్లును వ్యతిరేకించి, మహిళల హక్కులను విపక్షాలు కాలరాశాయని భాజపా రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా మహిళలు కదం తొక్కుతున్నారని అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. దక్షిణాది ప్రజలు కాంగ్రెస్, ప్రాంతీయ పార్టీలకు బుద్ధి చెబుతారని అన్నారు. 'మోదీకి ఆదరణ పెరుగుతుంది, భాజపా బలపడుతుందనే బిల్లును అడ్డుకున్నారు. మహిళలను చట్టసభలకు రాకుండా అడ్డుకున్నారు. దక్షిణాదికి అన్యాయం జరగదని చెప్పినా సాంకేతిక కారణాలతో మహిళా బిల్లును అడ్డుకున్నారు. దేశవ్యాప్తంగా మహిళలను ఏకం చేసి కాంగ్రెస్, విపక్షాలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తాం. డీలిమిటేషన్, 131వ రాజ్యాంగ సవరణ బిల్లుల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిపాదనను ఒక్క ఎంపీ కూడా పార్లమెంట్‌లో ప్రస్తావించలేదని లక్ష్మణ్ అన్నారు.



సంపాదకీయం

# మోదీ సర్కారుకు గుణపాఠం

## విపక్షాల ఐక్యతతో 'సవరణ'కు బ్రేక్!

ప్రజాస్వామ్యంలో నిరంకుశం చేస్తామంటే కుదరదు. ప్రతి విషయంలోనూ అలాగే వ్యవహరిస్తున్న మోడీ, ఇప్పుడు 131వ రాజ్యాంగ సవరణ విషయంలోనూ అలాగే చేసారు. మహిళా బిల్లు సందర్భంగా సరిగ్గా అదే జరిగింది. బిజెపి నిరంకుశ విధానంపై ఓ రకంగా తిరుగుబాటుగానే భావించాలి. అలాగే విపక్షాలను ఐక్యం చేసిన ఘనత కూడా మోడీదనే చెప్పాలి. వారి ఓటు చెక్కుచెదరకుండా వేయగలిగారు. అలాగే వారంతా ఒక్కటిగా నిలబడేలా చేశారు. ఇది భవిష్యత్ రాజకీయాలకు కీలక మలుపుగా భావించాలి. అందుకే 131వ రాజ్యాంగ సవరణ వీగిపోయింది. ఇకపోతే మహిళా బిల్లు వేరు..డీ లిమిటేషన్ వేరు. 2023లోనే దీనిని ఆమోదించి, 2029 నుంచి అమల్లోకి తీసుకుని వస్తామని గతంలోనే చెప్పారు. అనూహ్యంగా ఇప్పుడు రెండూ కలగలిపి తీసుకుని రావడం ద్వారా బిజెపికి శృంగభంగం తప్పలేదు. నిజానికి ఈ బిల్లులను తీసుకుని వచ్చే ముందు అఖిలపక్షంలో చర్చించలేదు. విపక్షాలను విశ్వాసంలోకి తీసుకోలేదు. సొంతపార్టీలో చర్చించలేదు. ఎన్‌డిఎ పక్షాలతోనూ చర్చించలేదు. బహుశా మోడీ, అమిత్ షాలు మాత్రమే చర్చించుకుని ఈ సవరణ బిల్లుకు యత్నించి ఉంటారు. బహుశా వారు ఇలాంటి పరిణామం ఎదురవుతుందని కూడా ఊహించ ఉంటారు. దీనిని ఆసరాగా చేసుకుని విపక్షాలను ఎండగట్టాలన్న ఉద్దేశం కూడా ఇందులో దాగి ఉంటుంది. అయితే విపక్షాల ఐక్యత ఇప్పుడు మోడీకి సవాల్ కానుంది. మొన్న సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి సంపూర్ణ మెజార్టీ కోల్పోయింది. కేవలం ఎన్‌డిఎ పక్షాల మద్దతుతో ప్రభుత్వం కొనసాగుతోంది. కనీసం ఎన్‌డిఎ పక్షాలతో అయినా మోడీ సమగ్రంగా చర్చించి ఉంటారని అనుకోవడానికి లేదు. ఒకప్పుడు బిజెపిలో మేధావి వర్గం ఉండేది. ఏదైనా సమస్యను ముందు పార్టీలో మేధావి వర్గంతో చర్చించేవారు. ఎత్తులు వేసేవారు. కానీ మోడీ వచ్చాక పెద్దలను దూరం పెట్టారు. ఇప్పుడు పెద్దా, చిన్నా అంతా ఆయనే. అందుకే మహిళా బిల్లు ముసుగులో డీలిమిటేషన్ తీసుకుని రావాలన్న ఎత్తుగడలను ప్రతిపక్షాలు ఉమ్మడి గా చిత్తుచేశాయి. మహిళా బిల్లును ఉన్నపళంగా అమలు చేయడానికి విపక్షాలు సిద్దంగా ఉన్నాయి. కానీ మోడీ ఎందుకనో అలా చేయకుండా మెలికి పెట్టారు. డీలిమిటేషన్ వల్ల కూడా సభ్యుల సంఖ్య పెరిగితే కూడా నష్టమే. 542 స్థానాలు ఉన్న లోక్‌సభ 600 వరకు పెరిగితే ఫర్వాలేదు. కానీ 816 లేదా 850కి పెంచాలన్న తీరు మాత్రం ఆమోదించదగ్గది కాదు. రాజకీయంగా పదవులు పెరిగితే దేశానికి నష్టమే తప్ప లాభం లేదు. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో బిజెపి వ్యవహరించిన తీరు, దానిని తరిస్కరించిన వైనం బిజెపికి గుణపాఠం కావాలి. ఇప్పటికైనా మేల్కొని ప్రజాస్వామ్య బద్దంగా పాలన చేయకుంటే విపక్షాలు మరింత ఐక్యం అవుతాయని నిరూపించాయి. ఇప్పటికే సర్ ప్రక్రియ సెగరేపుతోంది. ఇప్పుడు 131 సవరణ తోడయ్యింది. ప్రజలు ఎప్పుడూ బిజెపి వెంటే ఉంటారని అనుకోవడానికి లేదు. తాజా 131 సవరణ ప్రతిపాదన దక్షిణాదిలో కూడా తీవ్ర చర్చకు దారితీసింది. తమకున్న అధికారం పోతోఉందని, తమ ప్రాతినిధ్యానికి విలువ ఉండదన్న భావనలో ఇక్కడి నేతలు వచ్చారు. అందుకే దక్షిణ్యాది నేతలు కేంద్ర ప్రభుత్వం హడావిడిగా తెచ్చిన నియోజకవర్గాల పునర్విభజన బిల్లుకు వ్యతిరేకంగా పోరాటం చేసారు. మోదీ సర్కారుకు ఓటమి రుచి చూపించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును ముందుపెట్టి.. డీలిమిటేషన్ బిల్లును ఆమోదింపజేసుకోవాలన్న కేంద్ర ఎత్తుగడను లోక్‌సభలో శుక్రవారం మూకుమ్మడిగా తిప్పికొట్టడం వెనక ఈ ఐక్యత స్పష్టంగా కనిపించింది. మహిళా రిజర్వేషన్ చట్ట సవరణ బిల్లు సభలో వీగిపోయేలా చేయటంలో దక్షిణాది రాష్ట్రాల ఎంపీలు కూడా కీలకపాత్ర పోషించారు. ఆంధ్రప్రదేశ్‌లోని పార్టీలు మినహా తెలంగాణ, కేరళ, తమిళనాడు, కర్ణాటకలోని ఎన్డీయే యేతర పార్టీల ఎంపీలంతా ఈ బిల్లును మరో ఆలోచనకు తావులేకుండా తిరస్కరించారు. తమిళనాడుకు చెందిన 38మంది, కేరళలోని 20 మంది, తెలంగాణలోని 9మంది, కర్ణాటకలోని 9 మంది ఎన్డీయే యేతర ఎంపీలు డీలిమిటేషన్ బిల్లును అడ్డుకోవటంలో కీలకపాత్ర పోషించారు. డీలిమిటేషన్ బిల్లును బహిరంగా తగులబెట్టి తమ నిరసన ఏ స్థాయిలో ఉంటుందో చూడాలని కేంద్రాన్ని తమిళనాడు సిఎం స్టాలిన్ సవాల్ చేశారు. పార్లమెంటులోనూ తమిళనాడు ఎంపీలు నల్ల దుస్తులు ధరించి బిల్లుకు వ్యతిరేకంగా బలంగా పోరాటం చేశారు. కొత్తగా జనాభా లెక్కలను సేకరించకుండానే మోదీ సర్కారు ఏకపక్షంగా, హడావిడిగా డీలిమిటేషన్‌కు పూనుకోవటంపై అందరిలోనూ అనుమానాలు బలపడ్డాయి. కేంద్రం దక్షిణాదికి ద్రోహం చేస్తోందని ఎలుగెత్తారు. తమ రాష్ట్రాల ప్రాతినిధ్యం లేకుండానే భవిష్యత్తులో ఉత్తరాది బలంతో కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు జరిగేలా దక్షిణాది ప్రాతినిధ్యంతో పనిలేకుండా చేయటమే మోదీ సర్కారు అసలు లక్ష్యమని విమర్శలు గుప్పించారు. రాజ్యాంగాన్ని బలహీనపర్చి, దేశ ఎన్నికల ముఖచిత్రాన్నే మార్చేయాలని కేంద్రం కుట్ర చేస్తోందని కమ్యూనిస్టు పార్టీలు కూడా పోరాటం చేశాయి. అందుకే కసిగా ఉన్న స్టాలిన్ 'ఢిల్లీని తమిళనాడు ఓడించింది' అని ప్రకటించారు. ఈ క్రమంలో ఇప్పుడు బిజెపి పునరాలోచన చేయాలి. పెద్దలను, మేధావులను గౌరవించడం అలవాటు చేసుకవాలి. కీలకమైన ఇలాంటి సవరణల సందర్భంలో విపక్షాలను విశ్వాసంలోకి తీసుకోవాలి. డీలిమిటేషన్ కూడా లిమిట్ దాటకుండా సీట్లను కుదించాలి. అందరి ఆమోదంతో మళ్లీ బిల్లును ప్రవేశ పెట్టడం ద్వారా ముందుగా మహిళా బిల్లుకు ఆమోదం దక్కేలా చూడాలి. అప్పుడే పోయిన పరువు కొంతయినా దక్కుతుంది. అంతే తప్ప మహిళా బిల్లును వ్యతిరేకించారన్న ప్రచారం ఫలితం ఇవ్వదని గుర్తించాలి.

# మహిళలకు విపక్షాలు వ్యతిరేకం



- బిల్లును అడ్డుకుని పెద్ద తప్పు చేశాయి
- ఊరూరా ఈ విషయం ప్రచారం చేయండి
- కేబినేట్ భేటీలో ప్రధాని మోడీ సూచన
- కేంద్ర ఉద్యోగులకు 2శాతం డిఎ పెంపు
- 13వేల కోట్లతో సావరిన్ మారిటైమ్ ఫండ్ ఏర్పాటు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 18: మహిళా రిజర్వేషన్ల కోసం తెచ్చిన రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోవడంపై ప్రధాని మోదీ తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. ఈ విషయంలో విపక్షాలు జీవితాంతం చింతిస్తాయన్నారు. ప్రధాని అధ్యక్షతన దిల్లీలోని పార్లమెంట్ హౌస్‌లో శనివారం క్యాబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మోదీ ఈ వ్యాఖ్యలు చేసినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్ల బిల్లుకు మద్దతు ఇవ్వకుండా ప్రతిపక్ష పార్టీలు పెద్ద తప్పు చేశాయని ప్రధాని మోదీ అన్నారు. ఇందుకు వారు భారీ మూల్యం చెల్లించుకుంటాయని వ్యాఖ్యానించారు. ఈ విషయాన్ని కప్పిపుచ్చుకోవడానికి సాకులు వెతుకుతున్నారని విమర్శించారు. ప్రతిపక్ష పార్టీలు మహిళలకు వ్యతిరేకమనే విషయాన్ని ప్రతి గ్రామానికి చేరేలా తెలియజేయాలని పిలుపునిచ్చారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ 131వ రాజ్యాంగ సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం శుక్రవారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. అయితే, 298–230 ఓట్ల తేడాతో ఇది వీగిపోయింది. ఇకపోతే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. కరవు భత్యం (డీఏ) 2 శాతం పెంచడానికి నిర్ణయం తీసుకుంది. దీనికి కేంద్ర క్యాబినెట్ ఆమోద ముద్ర వేసింది. ఏటా రెండుసార్లు కేంద్ర ప్రభుత్వం డీఏను సవరిస్తుంది. పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా ఉద్యోగులు, పెన్షనర్లకు ఈ భత్యాన్ని అందజేస్తారు. ఏటా జనవరి, జులైలో ఈ సవరింపు ఉంటుంది. అయితే ఈసారి డీఏ పెంపు ప్రకటన ఆలస్యమైంది. దాంతో ఉద్యోగుల నుంచి ఆందోళన వ్యక్తమైంది. అలాగే ఈ క్యాబినెట్ సమావేశంలో సావరిన్ మారిటైమ్ ఫండ్ ఏర్పాటుకు కూడా ఆమోదం లభించింది. దీనికోసం రూ.13వేల కోట్లు కేటాయించనున్నారు. దీనికింద భారత జెండా నౌకలు, భారత్ నుంచి రాకపోకలు సాగించే నౌకలకు బీమా కవరేజీ అందించడమే లక్ష్యం. పశ్చిమాసియా ఉద్రిక్తతలతో హర్మూజ్ జలసంధిలో రవాణా నౌకలపై దాడులు జరిగిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ నిధిని ఏర్పాటుచేయడం గమనార్హం.

# మహిళా బిల్లు పేరుతో డీలిమిటేషన్ కుట్ర

- డీలిమిటేషన్‌తో తమిళనాడు ప్రాధాన్యం తగ్గింపు
- అందుకే రాజ్యాంగ సవరణ బిల్లును అడ్డుకున్నాం
- తమిళనాడు ఎన్నికల ప్రచారంలో రాహుల్



**చెన్నై, ఏప్రిల్ 18:** మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లు పార్లమెంటులో వీగిపోవడంపై కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ స్పందించారు. మహిళా రిజర్వేషన్ల వెనుక నియోజకవర్గాల పునర్విభజన దాగి ఉందని, రిజర్వేషన్ల పేరుతో పునర్విభజన బిల్లును ఆమోదించుకోవాలని కేంద్రం చూసిందని అన్నారు. ఈ డీలిమిటేషన్ బిల్లుతో తమిళనాడుకు ప్రాతినిధ్యం తగ్గిపోతుందని చెప్పారు. అందుకే దానిని అడ్డుకున్నామని అన్నారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా తిరువళ్లూరు జిల్లా పొన్నేరిలో జరిగిన ర్యాలీలో రాహుల్ శనివారంనాడు పాల్గొన్నారు. తమిళ భాష, సంస్కృతిని దెబ్బతీసేందుకు ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ గత కొన్నేళ్లుగా ప్రయత్నిస్తున్నాయని రాహుల్ విమర్శించారు. తమిళనాడుతో తనకున్న అనుబంధాన్ని వివరిస్తూ 'చాలా ఏళ్లుగా తమిళనాడు ప్రజలతో నాకు అనుబంధం ఉంది. నేను తమిళనాడులో పుట్టలేదు. నా కుటుంబం కూడా తమిళనాడు నుంచి వచ్చినది కాదు. అయినప్పటికీ ఇది నా సొంతిల్లులా అనిపిస్తుంది. తమిళ భాష, సంస్కృతిపై ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ దాడికి ప్రయత్నిస్తున్నాయి. వీళ్లకెంత ధైర్యం అని నాకు అపిస్తుంటుంది' అని రాహుల్ అన్నారు. పార్లమెంటులో పరిణామాలపై మాట్లాడుతూ, కొత్త బిల్లు పేరుతో వాళ్లు పార్లమెంటు ముందుకు వచ్చారని, దానిని మహిళా బిల్లు అని చెబుతున్నారని, అయితే మహిళా బిల్లును 2023లోనే ఆమోదించడం జరిగిందని తెలిపారు. బిల్లు వెనుక అసలు ఉద్దేశం నియోజకవర్గాల పునర్విభజనేనని అన్నారు. పార్లమెంటులో తమిళనాడుకు ప్రాతినిధ్యం తగ్గించడం, దక్షిణాది, ఈశాన్య రాష్ట్రాలను బలహీనపరచడం బిల్లు ఉద్దేశమని, అందువల్లే ఆ బిల్లును తాము ఓడించామని చెప్పారు. భారతదేశం రాష్ట్రాల యూనియన్ అనీ, అన్ని రాష్ట్రాల ను సమానంగా చూడాలని, కేంద్రంలో ప్రతి రాష్ట్రానికి మాట్లాడే అవకాశం, భాష, సంప్రదాయాలను స్వేచ్ఛగా ప్రకటించుకునే వీలుండాలని అన్నారు. బీజేపీ పాలనా విధానం ఇందుకు భిన్నంగా ఉందని, ప్రధానమంత్రి ఒకే దేశం, ఒకే నేత, ఒకే భాష, ఒకే ప్రజ అంటూ రాజ్యాంగంపై దాడి చేస్తున్నారని విమర్శించారు. కేంద్రం గుత్తాధిపత్యాన్ని తమ కూటమి అడ్డుకుంటుందని చెప్పారు. ఢిల్లీ నుంచి తమిళనాడును శాసించాలని బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ అనుకుంటున్నాయని రాహుల్ విమర్శించారు. అయితే ఇందుకు తాము ఎంతమాత్రం అనుమతించేది లేదన్నారు. తమిళనాడు తన భవిష్యత్తును తానే నిర్దేశించుకుంటుందని, తమిళ సంస్కృతి, హక్కులు, భాషా పరిరక్షణలో తాము ప్రజలకు బాసటగా ఉంటామని చెప్పారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఏప్రిల్ 23న జరుగనుండగా, మే 4న ఫలితాలు వెలువడతాయి.

# రాహుల్ గాంధీకి ఊరట

## పౌరసత్వ వివాదంలో ఎఫ్ఐఆర్ నమోదుపై హైకోర్టు స్టే



**ప్రయాగ్‌రాజ్, ఏప్రిల్ 17:** పౌరసత్వ వివాదంలో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలన్న ఆదేశాలపై అలహాబాద్ హైకోర్టు శనివారం స్టే విధించింది. శుక్రవారం రాహుల్‌పై విచారణకు ఆదేశించిన అదే లక్నో బెంచ్, నేడు ఆ నిర్ణయాన్ని నిలిపివేస్తూ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. రాహుల్ గాంధీ బ్రిటీష్ పౌరసత్వం కలిగి ఉన్నారన్న ఆరోపణలపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేయాలని జస్టిస్ సుభాష్ విద్యార్థి నేతృత్వంలోని బెంచ్ శుక్రవారం మౌఖికంగా ఆదేశించింది. అయితే, ఈ తీర్పు కాపీపై సంతకం చేసే ముందే కోర్టు తన నిర్ణయాన్ని సమీక్షించుకుంది. నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి (రాహుల్ గాంధీ) వాదన వినకుండా ఏకపక్షంగా ఆదేశాలు ఇవ్వడం సరికాదని ధర్మాసనం అభిప్రాయపడింది. 2014 నాటి ఒక ఫుల్ బెంచ్ తీర్పును ఉటంకిస్తూ, నిందితుడికి నోటీసులు ఇచ్చి వివరణ కోరడం తప్పనిసరని కోర్టు స్పష్టం చేసింది. కర్ణాటకకు చెందిన బీజేపీ కార్యకర్త విగ్నేష్ శిశిర్ ఈ పిటిషన్ వేశారు. 2003–2009 మధ్య లండన్‌లోని 'బ్యాక్ ఆప్స్ లిమిటెడ్' అనే కంపెనీకి డైరెక్టర్‌గా ఉన్న సమయంలో రాహుల్ గాంధీ తనను తాను బ్రిటీష్ పౌరుడిగా పేర్కొన్నారని, ఇది భారత రాజ్యాంగం ప్రకారం చట్టవిరుద్ధమని ఆయన వాదన.

# బొమ్మ కార్లతో పేలుళ్లకు ప్లాన్

## నలుగురు అనుమానితుల అరెస్టు

**న్యూఢిల్లీ:** సున్నితమైన ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని పేలుళ్లు జరిపేందుకు రెక్కీలు నిర్వహిస్తూ, ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంల ద్వారా ఇతరులను రిక్రూట్ చేసేందుకు ప్లాన్ చేస్తున్న నలుగురు వ్యక్తులను ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. నిఘా ఆధారిత ఆపరేషన్ ద్వారా ఇద్దరు నిందితులు మోసైబ్ అహ్మద్, హహమ్మద్ హమాద్‌ను మహారాష్ట్రలో, షేక్ ఇమ్రాన్ అనే వ్యక్తిని ఒడిశాలో, మహమ్మద్ సోహైల్‌ను బిహార్‌లో అరెస్టు చేశారు. వీరిలో ఇద్దరిని ఐఈడీ అమర్చిన రిమోట్ కంట్రోల్ బొమ్మ కారు తయారీకి యత్నిస్తుండగా పట్టుకున్నారు. నలుగురు నిందితులు తీవ్రవాద భావజాలంతో ప్రభావితమైనట్టు అధికారులు తెలిపారు. నిందితులలో ఒకడు ఎర్రకోట తమలక్ష్యమని తెలిపే సంకేతంతో నల్లజెండాతో కూడిన ఎర్రకోట మార్ఫింగ్ ఫోటోను షేర్ చేసినట్టు గుర్తించామని చెప్పారు. షేక్ ఇమ్రాన్ అనే నిందితుడు 2025లో ఎర్రకోట, ఇండియా గేట్ సహా కీలక ప్రదేశాల్లో రెక్కీ నిర్వహించినట్టు తెలిపారు. మోసైబ్ గతంలో గల్ఫ్ దేశాల్లో ఆటో ఎలక్ట్రీషియన్‌గా పనిచేశాడని, ఐఈడీ అమర్చిన రిమోట్ కంట్రోల్ కారు డిజైన్‌కు అవసరమైన సాంకేతిక నైపుణ్యం అతనికి ఉందని గుర్తించా మని వివరించారు. ఈ నలుగురిపై కేసు నమోదు చేసి నిందితుల నెట్‌వర్క్ ఛేదించేం దుకు, ఇతర ముఠాలతో సంబంధాలను గుర్తించేందుకు దర్యాప్తు జరుపుతున్నామని తెలిపారు.



# హోర్ముజ్ జలసంధిలో హైటెన్షన్

## భారత ట్యాంకర్‌పై ఇరాన్ సైన్యం కాల్పులు!

## మళ్లీ మూతపడిన కీలక జలమార్గం..

**టెహ్రాన్:** పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు మళ్లీ దట్టంగా కమ్ముకున్నాయి. అగ్రరాజ్యం అమెరికా, ఇరాన్ మధ్య నెలకొన్న ప్రతిష్టంభనతో హోర్ముజ్ జలసంధి వద్ద ఉద్రిక్తతలు పతాక స్థాయికి చేరాయి. శుక్రవారం జలసంధిని తెరుస్తున్నట్లు ప్రకటించిన ఇరాన్, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన దిగ్బంధన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోబోమని స్పష్టం చేయడంతో గంటల వ్యవధిలోనే మళ్లీ జలమార్గంపై ఆంక్షలు విధించింది. ఈ క్రమంలో శనివారం జలసంధి గుండా ప్రయాణిస్తున్న రెండు వాణిజ్య నౌకలపై ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ (ఐఆర్‌జీసీ) గన్‌బోట్లు కాల్పులకు పాల్పడటం అంతర్జాతీయంగా కలకలం రేపుతోంది. ఇరాక్ నుంచి సుమారు రెండు మిలియన్ బ్యారెళ్ల ముడి చమురును భారత్‌కు తీసుకువస్తున్న ఒక భారత జెండా కలిగిన సూపర్ ట్యాంకర్‌తో పాటు మరో వాణిజ్య నౌకపై ఇరాన్ సైన్యం కాల్పులు జరిపినట్లు 'ట్యాంకర్ ట్రాకర్స్' సంస్థ ధృవీకరించింది. ఓమన్ తీరానికి సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఎటువంటి ముందస్తు రేడియో హెచ్చరికలు లేకుండానే ఇరాన్ గన్‌బోట్లు కాల్పులు జరపడంతో, సదరు నౌకలు తమ దిశను మార్చుకుని వెనక్కి మళ్లాయి. అదృష్టవశాత్తూ ఈ దాడుల్లో నౌకలకు గానీ, అందలి సిబ్బందికి గానీ ఎటువంటి ప్రాణహాని జరగలేదని, అందరూ సురక్షితంగా ఉన్నారని సమాచారం అందింది. ఇరాన్ తన ఓడరేవులను తెరుస్తున్నట్లు ప్రకటించినప్పటికీ, అమెరికా మాత్రం ఇరాన్‌పై తన నావికా దళ దిగ్బంధనాన్ని కొనసాగిస్తామని ట్రంప్ ప్రకటించడం ఈ వివాదానికి ఆజ్యం పోసింది. "అమెరికా తన పద్ధతి మార్చుకోనంత వరకు హోర్ముజ్ జలసంధి తమ సైనిక నియంత్రణలోనే ఉంటుంది" అని ఇరాన్ మిలిటరీ కమాండ్ స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో పర్షియన్ గల్ఫ్ నుంచి చమురు సరఫరా చేసే భారత్‌కు చెందిన మరికొన్ని నౌకలు కూడా తమ ప్రయాణాన్ని నిలిపివేసి సురక్షిత ప్రాంతాలకు మళ్లాయి. ప్రపంచవ్యాప్తంగా సరఫరా అయ్యే చమురులో ఐదో వంతు హోర్ముజ్ జలసంధి నుండే వెళ్లాల్సి ఉంటుంది. తాజా కాల్పుల ఘటనతో అంతర్జాతీయ చమురు ధరలు మళ్లీ పెరిగే అవకాశం ఉందని విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు లెబనాన్‌లో కాల్పుల విరమణ ప్రయత్నాలు జరుగుతున్నా, మరోవైపు ఇరాన్–అమెరికా మధ్య పెరుగుతున్న ఈ ఘర్షణ వాతావరణం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపేలా కనిపిస్తోంది. ప్రస్తుతానికి భారత విదేశాంగ శాఖ ఈ పరిణామాలను నిశితంగా గమనిస్తోంది.





# పొనకల్ 'పవర్' జిమ్.. యువతకు ఆరోగ్య వరం!

## పోలీస్ స్టేషన్ ముందే ఓపెన్ జిమ్ ఏర్పాటు

## ముస్తాబైన పొనకల్ మేజర్ గ్రామ పంచాయతీ

- సర్పంచ్ జక్కు సుష్మ భూమేష్ వినూత్న నిర్ణయం
- జిల్లాలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్న పాలకవర్గం

**తుడుం జితేందర్-జనం పవర్-ఉత్తర తెలంగాణ బ్యూరో**

జన్నారం మండలం పొనకల్ మేజర్ గ్రామ పంచాయతీ ఇప్పుడు సరికొత్త 'హెల్త్ హబ్'గా మారుతోంది. కేవలం నగరాలకే పరిమితమైన ఓపెన్ జిమ్ సంస్కృతిని మారుమూల గ్రామీణ ప్రాంత యువతకు చేరువ చేస్తూ స్థానిక పంచాయతీ పాలకవర్గం తీసుకున్న నిర్ణయం ఇప్పుడు మండలంలో చర్చనీయాంశంగా మారింది. యువత శారీరక దృఢత్వంపై దృష్టి సారించాలనే లక్ష్యంతో ఈ వినూత్న ప్రాజెక్టును చేపట్టారు.

### ఆరోగ్య విప్లవం

పొనకల్ పోలీస్ స్టేషన్ కు సరిగ్గా ఎదురుగా ఆహ్లాదకరమైన వాతావరణంలో ఈ ఓపెన్ జిమ్ సిద్ధమవుతోంది. యువత చెడు వ్యసనాల వైపు వెళ్లకుండా వ్యాయామంపై ఆసక్తి పెంచుకోవాలనే ఉన్నత లక్ష్యంతో సర్పంచ్ జక్కు సుష్మ భూమేష్, మాజీ సర్పంచ్ జక్కు భూమేష్ ఈ పనులను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. పంచాయతీ కార్యదర్శి రాహుల్ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధం చేశారు.

### రాజకీయాలకు అతీతంగా ప్రశంసలు

సాధారణంగా అభివృద్ధి పనుల్లో విమర్శలు రావడం సహజం. కానీ పొనకల్ ఓపెన్ జిమ్ విషయంలో మాత్రం మండలంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులు ఏకతాటిపైకి వచ్చి సర్పంచ్ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నారు. యువతకు ఇదొక గొప్ప వరమని.. వ్యాయామం కోసం కిలోమీటర్ల దూరం వెళ్లాల్సిన అవసరం లేదని స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

### లక్ష్యం.. నంబర్ 1 పంచాయతీ!

పొనకల్ ను కేవలం పేరుకే మేజర్ పంచాయతీగా కాకుండా సౌకర్యాల్లో కూడా మేజర్ గా తీర్చిదిద్దుతామని సర్పంచ్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ ఓపెన్ జిమ్ కేవలం ఒక ఆరంభం మాత్రమేనని.. రానున్న రోజుల్లో మరిన్ని సంక్షేమ, అభివృద్ధి పనులతో పొనకల్ ను జిల్లాలోనే ఆదర్శంగా నిలుపుతామని పేర్కొన్నారు. త్వరలోనే ఈ జిమ్ గ్రామీణ క్రీడాకారులకు, యువతకు అందుబాటులోకి రానుంది. ఈ మార్పు పట్ల జన్నారం మండల వ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.




# చిన్నారుల వికాసమే లక్ష్యం!

- బేగంపేటలో ఘనంగా బాలమేళా
- హాజరైన ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ
- మొబైల్ ఫోన్లకు పిల్లలను దూరంగా ఉంచాలి
- అంగన్వాడీ టీచర్లకు ఫోన్ల పంపిణీ

**బెజ్జంకి, ఏప్రిల్ 19 (జనం పవర్):** బెజ్జంకి మండలంలోని బేగంపేట గ్రామంలో అంగన్వాడీ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన బాలమేళాఉపోషణ్ పక్వాడ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు.. నృత్యాలు ఆకట్టుకునేలా సాగి హాజరైన వారిని అలరించాయి. అనంతరం అంగన్వాడీ టీచర్లకు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న మొబైల్ ఫోన్లను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు.



ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చిన్నారులు మొబైల్ ఫోన్లకు బానిసలుగా మారకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చిన్నపిల్లలు ఫోన్లకు అలవాటు పడడం వల్ల వారి మాట తీరు.. అభివృద్ధిపై ప్రతికూల ప్రభావం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. చిన్న వయస్సులోనే శారీరక.. మానసిక వికాసం కోసం ప్రోటీన్ సమృద్ధిగా ఉండే ఆహారం అవసరమని పేర్కొన్నారు. ఈ దిశగా రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందిస్తున్నదని తెలిపారు.

గర్భిణీలు.. బాలింతలు.. చిన్నారులు అంగన్వాడీ సేవలను పూర్తిగా వినియోగించుకోవాలని కోరారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు పోషకాహారంతో పాటు ఆటపాటల ద్వారా విద్యను అందిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ తేజస్విని.. మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ.. వైస్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి.. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్.. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముక్కిస రత్నాకర్ రెడ్డి.. సర్పంచులు ఎల విజయ.. పులి రమేష్.. గూడెల్లి శ్రీకాంత్.. ముక్కిస కవిత.. అంగన్వాడీ టీచర్లు.. సిబ్బంది.. గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# జైపూర్ కేజీబీవీ హాస్టల్లో విషాదం

## సీసీ కెమెరాలు అమర్చుతూ కిందపడి టెక్నీషియన్ మృతి

## కాంట్రాక్టర్ నిర్లక్ష్యమే కారణమన్న మృతుని అన్న

## కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు





**జైపూర్, ఏప్రిల్ 18 (జనం పవర్):** జైపూర్ మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) హాస్టల్లో సీసీ కెమెరాలు అమర్చుతుండగా ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో మంచిర్యాల తిలక్ నగర్కు చెందిన తోగిటి శివ (29) అనే యువకుడు మృతి చెందాడు. మంచిర్యాలకు చెందిన మైక్రోచ్ కంప్యూటర్ షాప్ యజమాని ఆర్ రమేష్కు ఈ సీసీ కెమెరాల ఇన్స్టాలేషన్ కాంట్రాక్టు దక్కింది. ఈ పని నిమిత్తం శివ, రాజశేఖర్లను హాస్టల్కు పంపారు. శనివారం సాయంత్రం సమయంలో నిచ్చెనపై నిలబడి శివ సీసీ కెమెరాలు అమర్చుతుండగా ఒక్కసారిగా పైనుంచి కింద పడిపోయాడు. కింద పడటంతో తీవ్ర గాయాలై అపస్మారక స్థితిలోకి వెళ్లిన శివను అక్కడి వారు 108 అంబులెన్స్ ద్వారా మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే శివ మరణించినట్లు ధృవీకరించారు. కాంట్రాక్టర్ రమేష్ సరైన రక్షణ చర్యలు తీసుకోకుండా ఎక్కువ సమయం పనిచేయించడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని మృతుడి అన్న విజయ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విజయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జైపూర్ ఎస్ఐ తెలిపారు.

# పుల్లూరులో గ్రాడ్యుయేషన్ డే!

## ఎమ్పీపీఎస్లో విద్యార్థుల సందడి

## సర్టిఫికెట్లు అందజేసిన హెచ్ఎమ్స్వామి

## చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు అద్భుతం



**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (ఎమ్ పీ పీ ఎస్) పుల్లూరులో విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ వేడుకలకు హెచ్ ఎమ్ స్వామి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసి అభినందనలు తెలిపారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు ఆకట్టుకుని ప్రేక్షకుల నుంచి ప్రశంసలు అందుకున్నాయి. విద్యార్థుల ప్రతిభను మెచ్చుకున్న ముఖ్య అతిథి, వారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని ఆశీర్వదించారు. చిన్న వయసులోనే పిల్లల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీయడంలో పాఠశాల కృషి బాగుందని కొనియాడారు. ఈ కార్యక్రమ నిర్వహణలో ఉపాధ్యాయులు గోవర్ధన్ రెడ్డి, కళా కిరణ్, సరిత, శ్రీను, కృష్ణమణి, భవాని విశేష కృషి చేశారు. పెద్ద సంఖ్యలో తల్లిదండ్రులు హాజరై విద్యార్థులను ప్రోత్సహిస్తూ వేడుకలను విజయవంతం చేశారు. తమ పిల్లల అభివృద్ధిని చూసి తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

# గుండారం పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్

## చిన్నారుల వంటకాలు.. ఆహా ఏమి రుచి!

## వంటల ప్రదర్శనలో విద్యార్థుల సృజనాత్మకత

## ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్ భీమయ్య గౌడ్

## ఆకట్టుకున్న స్టాళ్లు, పోషక విలువల వివరణ

## విద్యార్థులను అభినందించిన అతిథులు





**బెజ్జంకి, ఏప్రిల్ 19 (జనం పవర్):** బెజ్జంకి మండలం గుండారం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్ను శనివారం ఘనంగా నిర్వహించారు. చిన్నారులు తమ చేతులతో తయారు చేసిన వివిధ రకాల ఆహార పదార్థాలను అందంగా అలంకరించిన స్టాళ్లలో ప్రదర్శిస్తూ, వాటి ప్రత్యేకతలు, పోషక విలువలను సందర్శకులకు వివరించారు. పిల్లలలో కనిపించిన సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం, చురుకుదనం అక్కడి ప్రతి ఒక్కరిని విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ తాళ్ళపెల్లి భీమయ్య గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై, విద్యార్థులు తయారు చేసిన వంటకాలను పరిశీలించి అభినందనలు తెలిపారు. పిల్లల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని, ఇవి విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఈ ప్రదర్శనలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉండ్రాళ్ళ తిరుపతి, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నూగూరి నాగవేణి, ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షురాలు బొప్పెన లలిత, ఉపాధ్యాయులు శ్రీనివాస్, శిరీష, హరీష పాల్గొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై చిన్నారుల ప్రతిభను చూసి మురిసిపోయారు.

# కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి నశించాలి!

**జన్నారంలో బీజేపీ భారీ నిరసన**

**మహిళా బిల్లును అడ్డుకోవడమేంటని ప్రశ్న**

**కాంగ్రెస్ దిష్టిబొమ్మ దహనం**



**తుడుం జితేందర్-జనం పవర్-ఉత్తర తెలంగాణ బ్యూరో**

మహిళా సాధికారతకు అత్యంత కీలకమైన మహిళా రిజర్వేషన్ బిల్లు విషయంలో కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న తీరు సరికాదని బీజే పీ జన్నారం మండల అధ్యక్షుడు మధుసూదన్ రావు విమర్శించారు. రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా శనివారం సాయంత్రం జన్నారం బస్టాండ్ ఆవరణలోని ప్రధాన రహదారిపై బీజే పీ నాయకులు, కార్యకర్తలు భారీ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ వైఖరిని నిరసిస్తూ ఆ పార్టీ దిష్టిబొమ్మను దహనం చేశారు. పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేయడం ద్వారా కాంగ్రెస్ తన అసలు స్వరూపాన్ని బయటపెట్టుకుందని మధుసూదన్ రావు మండిపడ్డారు. మాటల్లో మహిళా పక్షపాతి అని చెప్పుకునే ఆ పార్టీ, చేతల్లో మాత్రం మహిళా వ్యతిరేక పార్టీగా మిగిలిపోయిందని ధ్వజమెత్తారు. దేశాభివృద్ధిలో మహిళలు భాగస్వాములు కావాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును ప్రవేశపెడితే, రాజకీయ ప్రయోజనాల కోసం కాంగ్రెస్ అడ్డుపడటం శోచనీయమన్నారు. మహిళా లోకానికి కాంగ్రెస్ పార్టీ బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో మహిళలే ఆ పార్టీకి తగిన బుద్ధి చెబుతారని మధుసూదన్ రావు హెచ్చరించారు. చట్టసభల్లో మహిళలకు ప్రాతినిధ్యం పెరగకూడదనే కుట్రతోనే కాంగ్రెస్ ఈ బిల్లును వ్యతిరేకించిందని, మహిళల పట్ల ఆ పార్టీకి ఉన్న గౌరవం ఇదేనా అని నిలదీశారు. ఈ నిరసన కార్యక్రమంలో బీజే పీ మండల కమిటీ సభ్యులు, వివిధ విభాగాల నాయకులు, మహిళా మోర్చా ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ ఆందోళన వల్ల బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో కొంతసేపు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.

# మహిళా బిల్లును అడ్డుకున్న కాంగ్రెస్‌ను ఎండగట్టాలి!

**మహిళల కలలను చిదిమేస్తున్న హస్తం పార్టీ**

**బిల్లును వ్యతిరేకించడం సిగ్గుచేటు**

**బీజేపీ మండల అధ్యక్షుడు కొలిపాక రాజు ధ్వజం**

**బెజ్జంకి, ఏప్రిల్ 19 (జనం పవర్):** పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం దేశ మహిళల కోసం ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్ బిల్లును కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు బీజేపీ మండల అధ్యక్షుడు కొలిపాక రాజు తెలిపారు. శనివారం బెజ్జంకి మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మహిళల చిరకాల స్వప్నమైన ఈ బిల్లు విషయంలో కాంగ్రెస్ అనుసరించిన వైఖరి ఆ పార్టీ అసలు స్వరూపాన్ని మరోసారి బయటపెట్టిందని ఎద్దేవా చేశారు. దశాబ్దాలుగా మహిళా సాధికారత పేరుతో రాజకీయం చేసిన కాంగ్రెస్ పార్టీ ఆచరణలోకి వచ్చేసరికి బిల్లును అడ్డుకోవడం సిగ్గుచేటని కొలిపాక రాజు మండిపడ్డారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించి చట్టసభల్లో సమాన అవకాశాలు ఇవ్వాలన్న కేంద్ర ప్రభుత్వ చారిత్రాత్మక నిర్ణయానికి మద్దతు ఇవ్వకుండా కుంటి సాకులు చెబుతోందని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన 6 గ్యారంటీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఇప్పటికైనా మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతు ఇచ్చి మహిళలకు న్యాయం చేయాలని రాజు కోరారు. ఈ విలేకరుల సమావేశంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ బుర్ర మల్లేశం గౌడ్, మండల నాయకులు గైని రాజు, సంఘ రవి, లంకల కిషన్ రెడ్డి, దొమ్మాటి రాములు, వడ్లూరి సాయిలు, లోనే నర్సింగం, వడ్లూరి శ్రీను, బుర్ర కిషన్ పాల్గొన్నారు. తమ రాజకీయ ప్రయోజనాల కోసం మహిళా హక్కులను కాలరాయడం సరికాదని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

# ఉపాధి పనుల తనిఖీ

**ఫీడర్ ఛానల్ లోతు పెంచాలి**

**గుండారంలో డీఆర్డీఓ పీడీ జయదేవ్ ఆర్య పర్యటన**



**బెజ్జంకి, ఏప్రిల్ 19 (జనం పవర్):** బెజ్జంకి మండలంలోని గుండారం గ్రామంలో ఉపాధి హామీ పనులను సిద్దిపేట జిల్లా డీఆర్డీఓ పీడీ జయదేవ్ ఆర్య శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో జరుగుతున్న ఫీడర్ ఛానల్ పనులను పరిశీలించిన ఆయన, ఛానల్ ను మరింత లోతుగా పెంచాలని అధికారులను ఆదేశించారు. పనుల నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని స్పష్టం చేశారు.

**సౌకర్యాల పరిశీలన**

అనంతరం గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పీడీ సందర్శించారు. కొనుగోలు కేంద్రానికి వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా ఎండ తీవ్రత దృష్ట్యా రైతులకు నీడ కోసం టెంట్లు, ఇతర వసతులు కల్పించాలని ఆదేశించారు. ధాన్యం సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బెజ్జంకి ఎంపీడీవో ప్రవీణ్, సర్పంచ్, ఏపీవో, టెక్నికల్ అసిస్టెంట్, సీసీలు పాల్గొన్నారు. క్షేత్రస్థాయిలో పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులకు పీడీ దిశానిర్దేశం చేశారు. పనుల పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేస్తూనే, రైతులకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# బీసీ ముస్లింల లెక్కలు తప్పుల తడక!




**క్షేత్రస్థాయి వాస్తవాలకు గణాంకాలు దూరం**

**వెనుకబాటులో సంచార ముస్లింలదే అగ్రస్థానం**

**ప్రభుత్వ సర్వేపై ఎండీ షబ్బీర్ తీవ్ర అభ్యంతరం**

**సంచార తెగల జనాభాను తగ్గించి చూపడంపై ఆగ్రహం**

**కరీంనగర్, ఏప్రిల్ 18 (జనం పవర్):**

తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన బీసీ కులాల జనాభా లెక్కలు వాస్తవాలకు దూరంగా ఉన్నాయని తెలంగాణ రాష్ట్ర సంచార ముస్లిం తెగల సంఘం (బీసీ–ఈ 1–14) ఫౌండర్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎండీ షబ్బీర్ ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా బీసీ–ఈ వర్గంలోని సంచార ముస్లిం తెగల జనాభాను ప్రభుత్వం భారీగా తగ్గించి చూపిందని ఆయన తీవ్ర అభ్యంతరం తెలిపారు. శనివారం కరీంనగర్ లో ఆయన విలేకరులతో మాట్లాడారు. క్షేత్రస్థాయిలో వేల సంఖ్యలో ఉన్న సంచార ముస్లిం కుటుంబాలను కేవలం వందల్లో, తక్కువ వేలల్లో చూపడం వెనుక కుట్ర దాగి ఉందని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షల సంఖ్యలో ఉన్న ఉపకులాలను తక్కువగా చూపడం వల్ల భవిష్యత్తులో ఆయా వర్గాలకు అందాల్సిన సంక్షేమ పథకాలు, రిజర్వేషన్ ఫలాలు అందకుండా పోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

**వాస్తవాలకు విరుద్ధంగా గణాంకాలు**

ప్రభుత్వ సర్వేలోని లోపాలను ఎండీ షబ్బీర్ ఎండగట్టారు. రాష్ట్రవ్యాప్తంగా 4 లక్షల పైన ఉన్న ఫకీర్ సాయబుల జనాభాను కేవలం 46,349 గా నమోదు చేశారని విమర్శించారు. అలాగే 80 వేల నుంచి లక్ష వరకు ఉండే గారడి ముస్లింల జనాభా 14,063 అని చూపడం హాస్యాస్పదమన్నారు. ఒక్క మండలంలో ఉండే జనాభాను రాష్ట్ర మొత్తం జనాభాగా అచ్చుకట్ల వారు, సింగాలి వర్గాలకు చూపించారని మండిపడ్డారు. నాలుగు లక్షల పైన ఉన్న తుర్కా కాశీల జనాభాను 46,257 గా చూపడం వాస్తవ దూరం అని పేర్కొన్నారు. ముఖ్యంగా బొంతే వాలాల ప్రస్తావనే ఈ సర్వేలో లేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. సర్వే సమయంలో వివిధ ఉపకులాల వారందరినీ షేక్ కేటగిరీలో నమోదు చేయడం వల్ల సంచార తెగల ఉనికి ప్రశ్నార్థకమవుతోందని హెచ్చరించారు.

**వెనుకబాటులో మొదటి స్థానం**

ప్రభుత్వ స్కోర్ ప్రకారం పరిశీలిస్తే రాష్ట్రంలోని అన్ని సామాజిక వర్గాల కంటే సంచార ముస్లింలే విద్యా, ఆర్థిక, సామాజిక రంగాల్లో అట్టడుగున ఉన్నారని షబ్బీర్ వివరించారు. బీసీ–ఈ జాబితాలోని 1 నుంచి 14 వరకు ఉన్న సీబీఐ స్కోర్ 100 నుంచి 111 వరకు ఉందంటే వారి స్థితిగతులు ఎంత దయనీయంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చన్నారు. సంచార ముస్లింల అస్తిత్వాన్ని కాపాడాలని, కుల ధృవీకరణ పత్రాల జారీలో ఎదురవుతున్న ఇబ్బందులను తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే ఈ తప్పుడు లెక్కలను సరిదిద్ది, శాస్త్రీయ పద్ధతిలో పునఃసమీక్ష జరపాలని కోరారు. అత్యంత వెనుకబడిన ఈ తెగలకు ప్రత్యేక ప్యాకేజీతో పాటు రక్షణ కల్పించాలని హితవు పలికారు. ప్రభుత్వం స్పందించి న్యాయం చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# వేగం పెంచితే కటకటాలకే..



**వన్యప్రాణుల మృత్యుఘోషకు చెక్!**

**కవ్వాల్ టైగర్ రిజర్వ్ అటవీ మార్గంలో నిరంతర నిఘా**

- జన్నారం ఎఫ్డీఓ రామ్మోహన్ కఠిన ఆదేశాలు
- గరిష్ట వేగ పరిమితి 30 కిలోమీటర్లు మాత్రమే
- నిబంధనలు అతిక్రమిస్తే వాహనాలు సీజ్
- బారికేడ్ల వద్ద అప్రమత్తంగా ఉండాలని సూచన
- మూగజీవాల ప్రాణాల రక్షణకు ఉక్కుపాదం




**తుడుం జితేందర్-జనం పవర్-ఉత్తర తెలంగాణ బ్యూరో**

కవ్వాల్ టైగర్ రిజర్వ్ కోర్ ఏరియా గుండా ప్రయాణించే వాహనదారులు తమ వేగానికి బ్రేక్ వేయాల్సిందేనని, లేనిపక్షంలో కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని జన్నారం ఎఫ్డీఓ రామ్మోహన్ హెచ్చరించారు. అభయారణ్య నిబంధనలను బేఖాతరు చేస్తూ అతివేగంగా వాహనాలు నడిపేవారిపై ఇకపై ఉక్కుపాదం మోపుతామని ఆయన స్పష్టం చేశారు. జన్నారం డివిజన్ పరిధిలోని అటవీ రహదారులపై అతివేగం కారణంగా మూగజీవాలు బలైపోతున్న నేపథ్యంలో అటవీ శాఖ ఈ నిర్ణయం తీసుకుంది.




**రక్తసిక్తమవుతున్న అటవీ మార్గాలు**

గత కొంతకాలంగా అటవీ రహదారులపై అతివేగం కారణంగా మూగజీవాలు బలైపోతున్నాయి. అడవి దున్నలు, దుప్పులు, జింకలు రోడ్డు దాటుతున్న సమయంలో వాహనాలు ఢీకొనడంతో అనేక వన్యప్రాణులు అక్కడికక్కడే మృత్యువాత పడుతున్నాయి. ఈ ప్రమాదాల్లో కేవలం వన్యప్రాణులే కాకుండా, పశువులు, ప్రయాణికులు సైతం తీవ్ర గాయాలపాలవుతున్నారని, కొన్నిసార్లు ప్రాణనష్టం కూడా జరుగుతోందని ఎఫ్డీఓ ఆవేదన వ్యక్తం చేశారు. వన్యప్రాణుల ప్రాణాలకు రక్షణ కల్పించడం అందరి బాధ్యత అని ఆయన గుర్తు చేశారు.

**వేగ పరిమితిపై కఠిన ఆదేశాలు**

వన్యప్రాణుల రక్షణ దృష్ట్యా అటవీ మార్గంలో 30 కిలోమీటర్ల గరిష్ట వేగ పరిమితిని కచ్చితంగా పాటించాలని అధికారులు ఆదేశించారు. వన్యప్రాణులు తరచుగా సంచరించే ప్రాంతాల్లో వేగ నియంత్రణ కోసం అటవీ శాఖ ప్రత్యేకంగా బారికేడ్లను ఏర్పాటు చేసింది. ఈ బారికేడ్ల వద్ద వేగాన్ని తగ్గించకుండా అజాగ్రత్తగా వెళ్లే వాహనాలను గుర్తించి, వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద భారీ జరిమానాలతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని రామ్మోహన్ హెచ్చరించారు. అడవి వన్యప్రాణుల ఆవాసమని, ప్రయాణికులు అతిథులు మాత్రమేనని ప్రతి ఒక్కరూ గుర్తించాలని కోరారు.

**నిరంతర నిఘా, తనిఖీలు**

అటవీ మార్గంలో వేగ పరిమితిని పర్యవేక్షించేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించినట్లు డివిజన్ అధికారులు తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే వాహనం సీజ్ చేయడమే కాకుండా, డ్రైవింగ్ లైసెన్స్‌ను రద్దు చేసేలా రవాణా శాఖకు సిఫార్సు చేస్తామని అటవీ శాఖ స్పష్టం చేసింది. ప్రతి వాహనదారుడు సహకరించి వన్యప్రాణుల ప్రాణాలను కాపాడాలని ఎఫ్డీఓ విజ్ఞప్తి చేశారు. అటవీ సంపదను, వన్యప్రాణులను కాపాడుకోవడంలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని పేర్కొన్నారు.





# రిటైర్మెంట్ ఉద్యోగి ఐలయ్యకు ఘన సన్మానం

- విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో బోధన
- క్రమశిక్షణకు మారుపేరు ఐలయ్య
- సమాజ ఉన్నతికి పాటుపడాలి: మున్సిపల్ చైర్మన్, ఎంఈఓ

**జమ్మికుంట, ఏప్రిల్ 19 (జనం పవర్):** ఉద్యోగ జీవితంలో పదవీ విరమణ అనేది తప్పనిసరి అని, రిటైర్మెంట్ తర్వాత సమాజ ఉన్నతికి, అభివృద్ధికి పాటుపడాలని మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్, మండల విద్యాధికారి (ఎంఈఓ) మంతెన హేమలత అన్నారు. శనివారం జమ్మికుంట పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్ బాలికల ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న బీనవేన ఐలయ్య పదవీ విరమణ వేడుకల సమావేశం ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడి అధ్యక్షతన నిర్వహించారు. పదవీ విరమణ పొందుతున్న ఐలయ్యను ముఖ్య అతిథులు శాలువతో, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

### ఆదర్శవంతమైన సేవలు

గత 30 ఏళ్లుగా వివిధ పాఠశాలల్లో ఐలయ్య నిబద్ధత, క్రమశిక్షణతో సమయపాలన పాటిస్తూ ఆదర్శంగా నిలిచారని అతిథులు కొనియాడారు. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేస్తూ వందలాది మందిని డాక్టర్లు, ఇంజనీర్లు, వివిధ రంగాల్లో గెజిటెడ్ ఉద్యోగులుగా తీర్చిదిద్దిన ఘనత ఆయనకే దక్కుతుందని ప్రశంసించారు. ఇల్లందకుంట మండలం గడ్డివానిపల్లి గ్రామంలో నిరుపేద కుటుంబంలో జన్మించి, స్వయంకృషితో ఉన్నత చదువులు చదివి ఉద్యోగం సంపాదించి ఎంతోమంది ఉపాధ్యాయులకు మార్గదర్శిగా నిలవడం గర్వకారణమని పేర్కొన్నారు.

### ఉద్వేగభరిత వీడ్కోలు

తన సేవా కాలంలో సహకరించిన సహచరులకు, విద్యార్థులకు ఐలయ్య ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల అభివృద్ధి కోసం అందరూ కలిసి పనిచేయాలని ఆకాంక్షించారు. ఐలయ్య పదవీ విరమణ సందర్భంగా విద్యార్థులు కంటతడి పెట్టడం పలువురిని కలిచివేసింది. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ ఆర్టీసీ డీఎం రవీంద్రనాథ్, సూపరింటెండెంట్ నసిరుద్దీన్, ట్రాఫిక్ సూపరింటెండెంట్ సారయ్య, ఎస్ఆర్ఆర్ కాలేజీ వైస్ ప్రిన్సిపల్ టీ రాజయ్య, కేడీసీ ప్రొఫెసర్ ఎం రవీందర్, ఉపాధ్యాయులు కే వెంకటేశ్వర్లు, తిప్పారపు శ్రీనివాస్, వీర్ల శ్రీలత పాల్గొన్నారు.





# వాహనదారులు నిబంధనలు పాటించాలి!

- సురక్షిత ప్రయాణంతోనే క్షేమంగా గమ్యస్థానాలకు..
- ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా వైద్య శిబిరం
- ఆటో, లారీ డ్రైవర్లకు కంటి పరీక్షలు, అద్దాల పంపిణీ
- నిబంధనలు ఉల్లంఘిస్తే లైసెన్స్ సస్పెండ్
- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ హెచ్చరిక

**వేల్పుల నగేష్, జనం పవర్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో**

వాహనదారులు రహదారి భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటించి గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుకోవాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మంచిర్యాల జిల్లాలోని వేంపల్లిలో గల జిల్లా రవాణా శాఖ అధికారి కార్యాలయ ఆవరణలో 'అరైవ్ అలైవ్'లో భాగంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి ఆయన హాజరయ్యారు. జిల్లా రవాణా అధికారి సీహెచ్ రంజిత్, ఇతర అధికారులతో కలిసి కలెక్టర్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

### వైద్య పరీక్షల నిర్వహణ

ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన ఈ శిబిరంలో ఆటో, లారీ డ్రైవర్లకు వైద్య, కంటి పరీక్షలు నిర్వహించామని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ వైద్య కళాశాల, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుల ద్వారా దాదాపు 200 మంది డ్రైవర్లకు పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు, కంటి అద్దాలు పంపిణీ చేశారు. వాహనాలు నడిపేవారికి కంటిచూపు అత్యవసరమని, సమస్యలు ఉన్నవారికి అవసరమైతే శస్త్రచికిత్సలు కూడా చేయిస్తామని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదం అంటే ఒక కుటుంబానికి జరిగే ప్రమాదమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

### ట్రాఫిక్ నిబంధనల అమలు

రోడ్లపై ప్రయాణించే సమయంలో రక్షణే ముఖ్యమని, ప్రతి వాహనదారుడు లైసెన్స్ కలిగి ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లలో ప్రయాణించే వారు సీటు బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. వాహనం నడిపే సమయంలో వేగ పరిమితి పాటించాలని, మద్యం సేవించి లేదా మొబైల్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకూడదని హెచ్చరించారు. అనుభవానికి, ప్రమాదానికి సంబంధం లేదని, వాహనం నడిపే సమయంలో ఏకాగ్రత తప్పనిసరి అని తెలిపారు. ప్రతి వాహనానికి సంబంధించిన ధ్రువపత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు.

### కఠిన చర్యలు తప్పవు

తనిఖీల్లో మద్యం సేవించి పట్టుబడితే వాహనదారుడి లైసెన్స్ సస్పెండ్ చేస్తామని కలెక్టర్ హెచ్చరించారు. 18 ఏళ్ల లోపు వారు వాహనాలు నడిపితే వారి తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రాంగ్ రూట్ లో ప్రయాణించడం, అతివేగం చాలా ప్రమాదకరమని పేర్కొన్నారు. జిల్లాలో రహదారులపై లైట్లు, బ్లైండ్ స్పాట్లను గుర్తించి తగు ఏర్పాట్లు చేస్తున్నామని, సిగ్నల్ వ్యవస్థల ద్వారా వాహనాలను నియంత్రించేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే

- కేంద్రాలలో రైతులకు అన్ని వసతులు కల్పించాలి: కవ్వంపల్లి
- వడ్లూరులో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం
- దళారులను నమ్మి రైతులు నష్టపోవద్దు
- మద్దతు ధర కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం



**బెజ్జంకి, ఏప్రిల్ 19 (జనం పవర్):** మండలంలోని బెజ్జంకి, వడ్లూరు గ్రామాలలో శనివారం మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. బెజ్జంకి మండల కేంద్రంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం, వడ్లూరులో రైతుల విజ్ఞప్తి మేరకు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకుని రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మంచినీటి వసతి, ఎండ తగలకుండా టెంట్లు వేయించాలని అధికారులను ఆదేశించారు.



### రైతులకు వసతులు కల్పించాలి

ఆయా గ్రామాలకు చెందిన రైతులు తమ గ్రామ పరిధిలోని కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించుకోవాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. రైతులు దళారులకు ధాన్యం విక్రయించి నష్టపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాలలోనే అమ్మి మద్దతు ధర పొందాలని సూచించారు. క్షేత్రస్థాయిలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఐకేపీ సిబ్బంది పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ సిబ్బంది, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్, మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, వైస్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్ బొల్లం శ్రీధర్, ఉప సర్పంచ్ ధూమాల మహేష్, కాంగ్రెస్ నాయకులు ఐలేని శ్రీనివాస్ రెడ్డి, రావుల నరసయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, వార్డు సభ్యులు పాల్గొన్నారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

# కోహెడ మండలంలో ఐకేపీ సెంటర్ల ప్రారంభం!

**మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట**

**బస్వాపూర్, ఆరెపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు**

**ప్రారంభించిన మార్కెట్ కమిటీ చైర్మన్ నిర్మల జయరాజ్**



**కోహెడ, ఏప్రిల్ 19 (జనం పవర్):** సిద్దిపేట జిల్లా కోహెడ మండలంలోని బస్వాపూర్, ఆరెపల్లి, తీగలకుంటపల్లి, మైసంపల్లి గ్రామాల్లో ఐకేపీ సెంటర్లను మార్కెట్ కమిటీ చైర్మన్ నిర్మల జయరాజ్, గ్రామ సర్పంచ్‌లు కలిసి ప్రారంభించారు. గ్రామాల అభివృద్ధి, మహిళా సాధికారత లక్ష్యంగా ఈ సెంటర్ల ప్రారంభం జరిగింది. ఈ కార్యక్రమాలకు స్థానిక ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, రైతులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సెంటర్లను ప్రారంభించిన అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఐకేపీ సెంటర్లు గ్రామీణ మహిళలు ఆర్థికంగా బలపడేందుకు మంచి అవకాశాలను కల్పిస్తాయని మార్కెట్ కమిటీ చైర్మన్ నిర్మల జయరాజ్ తెలిపారు. మహిళా సంఘాల ద్వారా స్వయం ఉపాధి అవకాశాలు పెరిగి కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని గ్రామాభివృద్ధికి సహకరించాలని గ్రామ సర్పంచ్‌లు ప్రజలను కోరారు. మహిళలు స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలని సూచించారు. గ్రామాల్లో ఐకేపీ సెంటర్ల ప్రారంభం ప్రజల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఈ సెంటర్ల ద్వారా మహిళా సాధికారతకు కొత్త దిశ ఏర్పడుతుందని స్థానికులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు, సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, ఆత్మ కమిటీ డైరెక్టర్, మహిళా సంఘాల సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ పార్టీల నాయకులు, హమాలీ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# గోహత్య నిషేధ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలి!

**గోవధశాలలను తక్షణమే మూసివేయాలని డిమాండ్**

**గోచర భూములకు విముక్తి కల్పించాలని విజ్ఞప్తి**

**ఆలయాల్లో గోవుల పెంపకాన్ని చేపట్టాలి**

**నిధులు కేటాయించకుంటే గోరక్ష అసాధ్యమన్న గోప్రేమికులు**



**సంగారెడ్డి, ఏప్రిల్ 19 (జనం పవర్):** గోమాతను సకల దేవతా స్వరూపంగా భావిస్తూ వేదకాలం నుంచే భారతీయ సంస్కృతిలో ఆరాధన కొనసాగుతోందని గోప్రేమికులు పేర్కొన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ పరిపుష్టి నుంచి పర్యావరణ పరిరక్షణ, వ్యవసాయం, మానవ ఆరోగ్య రక్షణ వరకు గోవుల పాత్ర ఎంతో కీలకమని వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో గోవులను విచ్చలవిడిగా వధించి మాంసాహారంగా ఉపయోగించడం, విదేశాలకు భారీ స్థాయిలో గోమాంసం ఎగుమతి చేయడంపై ఆందోళన వ్యక్తం చేశారు. గోహత్య నిషేధ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

### చట్టం అమలులో నిర్లక్ష్యం

గోవుల సంరక్షణ కోసం అమల్లో ఉన్న "తెలంగాణ ప్రోహిబిషన్ ఆఫ్ కౌ స్లాటర్ అండ్ అనిమల్ ప్రిజర్వేషన్ యాక్ట్, 1977" అమలులో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని గోప్రేమికులు ఆరోపించారు. రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలు, ఆర్టికల్ 48 ప్రకారం గోరక్షకు ప్రాధాన్యం ఉన్నప్పటికీ చట్టవిరుద్ధంగా గోవధ కొనసాగుతోందని మండిపడ్డారు. ముఖ్యంగా బక్రీద్ సందర్భంగా గోవధ మరింత పెరుగుతోందని, బలిష్టమైన ఎద్దులను సైతం వధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గోరక్ష సంస్థలు పలుమార్లు విజ్ఞప్తి చేసినా అధికారుల నుంచి సరైన స్పందన లభించడం లేదని విమర్శించారు.

### ప్రధాన డిమాండ్లు

రాష్ట్రంలో చట్టవిరుద్ధంగా కొనసాగుతున్న గోవధశాలలను తక్షణం మూసివేయాలని గోప్రేమికులు డిమాండ్ చేశారు. ఆక్రమణలో ఉన్న గోచర భూములను విముక్తి చేయాలని, గుర్తింపు పొందిన గోశాలలకు నిధులు కేటాయించాలని కోరారు. ప్రతి జిల్లాలో ప్రభుత్వ ఆధ్వర్యంలో గోశాలలు ఏర్పాటు చేయాలని, దేవాదాయ శాఖ పరిధిలోని ఆలయాల్లో గోవుల పెంపకం చేపట్టాలని సూచించారు. గో ఆధారిత వ్యవసాయం చేసే రైతులకు, గోపోషకులకు ప్రోత్సాహకాలు అందించాలని విన్నవించారు. బక్రీద్ సందర్భంగా గోరక్షకులకు గుర్తింపు పత్రాలు జారీ చేసి పోలీసులు సహకారం అందించాలని కోరారు. హైదరాబాద్ పరిధిలోని బోరబండ బబ్బిగూడ, నార్సింగి ప్రాంతాల్లో జరుగుతున్న పశువుల సంతలను తక్షణమే ఎత్తివేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం స్పందించి చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేస్తేనే గోరక్ష సాధ్యమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



# రోడ్డు భద్రతపై అవగాహన!

**హెల్మెట్ ధరించిన వారికి పూలమాలలు**

**ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కోవ లక్ష్మి**

**ప్రాణ రక్షణకు హెల్మెట్ తప్పనిసరి**

**విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ**




**వేల్పుల నగేష్, జనం పవర్-ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో**

ఆసిఫాబాద్ జిల్లా కేరమేరి మండల కేంద్రంలో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు స్థానిక ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఎస్ఐ మధుకర్, పాఠశాల విద్యార్థులతో కలిసి ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ హెల్మెట్ ధరించి వాహనం నడుపుతున్న ప్రయాణికులను ఎమ్మెల్యే, విద్యార్థులు స్వయంగా పువ్వులు ఇచ్చి అభినందించారు. వాహనదారులలో మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో ఈ వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హెల్మెట్ ధరించడం అనేది కేవలం చట్టం కోసం మాత్రమే కాకుండా ప్రతి ఒక్కరి ప్రాణాల రక్షణకు ఎంతో కీలకమని అన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాపాయం నుంచి తప్పుకోవాలంటే హెల్మెట్ ధరించడం తప్పనిసరని వివరించారు. అందరూ బాధ్యతగా వ్యవహరించి హెల్మెట్ ధరించాలని ఆమె పిలుపునిచ్చారు. కుటుంబ సభ్యుల భద్రతను దృష్టిలో ఉంచుకుని వాహనదారులు నిబంధనలు పాటించాలని కోరారు. వాహనదారులు నిబంధనలు పాటించేలా చైతన్యం చేయడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని ఎస్ఐ మధుకర్ పేర్కొన్నారు. అతివేగం, అజాగ్రత్త డ్రైవింగ్ వల్ల కలిగే ప్రమాదాలను విద్యార్థులు ప్రయాణికులకు వివరించారు. నిబంధనలు పాటించే వారిని అభినందించడం వల్ల ఇతరులకు స్ఫూర్తి కలుగుతుందని పోలీసులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# మానవ సేవలో పరమానందం!

**కబ్రస్తాన్‌లో బోరుబావి వేయించిన కౌన్సిలర్**

**సొంత నిధులతో నీటి సమస్య తీర్చిన మమత రాజు**



**సదాశివపేట, ఏప్రిల్ 19 (జనం పవర్):** సదాశివపేట పట్టణంలోని పాత పెరుమాళ్ళ ఆలయ సమీపంలో జాతీయ రహదారి 65 వద్ద గల ముస్లిం సోదరులకు చెందిన కబ్రస్తాన్ ప్రాంగణంలో నెలకొన్న నీటి సమస్యను 12వ వార్డు కౌన్సిలర్ పులిమామిడి మమత రాజు తీర్చారు. కబ్రస్తాన్ లో నీరు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ముస్లిం సోదరులు పులిమామిడి రాజును కలిసి విన్నవించగా.. కౌన్సిలర్ మమత రాజు వెంటనే స్పందించారు. తన సొంత నిధులతో అక్కడ బోరుబావి వేయించి ప్రజలకు నీటి సౌకర్యం కల్పించారు. కబ్రస్తాన్‌కు వచ్చే ప్రజలు నీటి కోసం గతంలో తీవ్ర ఇబ్బందులు పడేవారని, ఈ బోరుబావి ఏర్పాటుతో ఆ సమస్య శాశ్వతంగా తీరిందని మమత రాజు పేర్కొన్నారు. మానవ సేవలోనే మహా ఆనందం ఉందని, ప్రజల కష్టాలను తీర్చడమే తన లక్ష్యమని ఆమె వివరించారు. ఈ నూతన బోరుబావి వల్ల కబ్రస్తాన్‌కు వచ్చే వారికి తాగునీరు కూడా అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి సేవా కార్యక్రమాలు చేపట్టడంలో తనకు సంతృప్తిని ఇస్తుందని చెప్పారు. ప్రజల సమస్యలపై చొరవ చూపుతూ సొంత ఖర్చులతో బోరుబావి వేయించిన కౌన్సిలర్ మమత రాజు సేవాభావాన్ని స్థానికులు అభినందించారు. భవిష్యత్తులో కూడా ఇటువంటి అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కబ్రస్తాన్ కమిటీ సభ్యులు అక్బర్ హుస్సేన్, మక్సుద్, మహమ్మద్ ఫయాజ్, సర్వర్, అన్వర్, పర్వేజ్, హాజీ పటేల్, హర్షద్, రఫీ, జబ్బార్, పీఎంఆర్ యువసేన నాయకులు పాల్గొన్నారు. కౌన్సిలర్ చేసిన ఈ పని పట్ల ముస్లిం పెద్దలు హర్షం వ్యక్తం చేశారు.

# డయాలసిస్ కేంద్రం ఏర్పాట్ల పరిశీలన



**జమ్మికుంట, ఏప్రిల్ 19 (జనం పవర్):** కిడ్నీ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కొత్తగా డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. ఈ క్రమంలో జమ్మికుంట సామాజిక ఆరోగ్య కేంద్రానికి డయాలసిస్ మంజూరు కాగా శనివారం డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ, డీసీహెచ్ కృష్ణ ప్రసాద్, డెప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రవణ్ కుమార్ మౌలిక సదుపాయాలు పరిశీలించారు. పడకలు, తగినంత స్థలం, గదులు, తాగునీటి సౌకర్యం తనిఖీ చేశారు. ఈ కేంద్రం వల్ల కిడ్నీ రోగులకు సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా దగ్గరలోనే డయాలసిస్ అందుతుందని తెలిపారు. అనంతరం లేబర్ రూమ్, వార్డులు, రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ప్రతి గర్భిణీకి మెరుగైన వైద్యం అందించాలని, సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని ఆదేశించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన సేవలు అందించాలని, సిబ్బంది సమయపాలన పాటించాలని, విధుల్లో అలసత్వం ప్రదర్శించవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్ కృష్ణ ప్రసాద్, డెప్యూటీ డీఎంహెచ్ఓ శ్రవణ్ కుమార్, సీహెచ్ఓ సదానందం, హెల్త్ ఎడ్యుకేటర్ పంజాల ప్రతాప్ గౌడ్ పాల్గొన్నారు.

# బీజేపీ ప్రశిక్షణ తరగతులు ప్రారంభం!

- పార్టీ సిద్ధాంతాలపై కార్యకర్తలకు అవగాహన
- హుస్నాబాద్‌లో క్యాడర్‌కు రాంగోపాల్ రెడ్డి దిశానిర్దేశం
- గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలి
- 8 సెషన్లతో నాయకత్వ లక్షణాలపై శిక్షణ



**కోహెడ, ఏప్రిల్ 19 (జనం పవర్):** హుస్నాబాద్ నియోజకవర్గంలో బీజేపీ మండల స్థాయి సమావేశం, ప్రశిక్షణ తరగతులు ఘనంగా నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహాబియాన్ లో భాగంగా మొత్తం 8 సెషన్ల ద్వారా పార్టీ సిద్ధాంతాలు, నాయకత్వ లక్షణాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా రాంగోపాల్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి శిక్షణ తరగతులు ఎంతో అవసరమని తెలిపారు. కార్యకర్తలు పార్టీ సిద్ధాంతాలు, విధానాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రశిక్షణ కార్యక్రమాల ద్వారా కార్యకర్తలు మరింత చురుకుగా పనిచేసి ప్రజల్లో పార్టీ ప్రభావాన్ని పెంచగలరని పేర్కొన్నారు. నియోజకవర్గంలో పార్టీ విస్తరణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

**గ్రామ స్థాయి నుంచి నిర్మాణం**

గ్రామ స్థాయి నుంచి పార్టీకి బలమైన నిర్మాణం ఏర్పరచాలని రాంగోపాల్ రెడ్డి సూచించారు. ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తూ ప్రభుత్వ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అధ్యక్షుడు జాలిగం రమేష్, ఖమ్మం వెంకటేష్, రామచంద్రారెడ్డి, బుక్య సంపత్, పోలోజ యాదగిరి, దంచాల శ్రీనివాస్, రామోజీ శ్రీనివాస్, శ్రీకాంత్, రాయికంటి చందు, శ్రీకాంత్ యాదవ్ పాల్గొన్నారు. పార్టీ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని ఈ సందర్భంగా నాయకులు స్పష్టం చేశారు.





# సిగాచి బాధితుల ‘మహా ధర్నా’!

- కోటి రూపాయల పరిహారం వెంటనే చెల్లించాలి
- సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద ఉద్రిక్తత, తోపులాట
- టీపీజేఏసీ ఆధ్వర్యంలో బాధితుల నిరసన
- ప్రభుత్వ అధికారుల వైఫల్యమే కారణమన్న టీపీజేఏసీ

**సంగారెడ్డి, ఏప్రిల్ 19 (జనం పవర్):** సంగారెడ్డి జిల్లా పశమైలారం సిగాచి పరిశ్రమ పేలుడు ఘటనలో ప్రాణాలు కోల్పోయిన 54 మంది కార్మికుల కుటుంబాలకు పూర్తిస్థాయి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ పీపుల్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీపీజేఏసీ) ఆధ్వర్యంలో ఆదివారం సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఎదుట ‘మహా ధర్నా’ నిర్వహించారు. సుమారు 60 మంది బాధిత కుటుంబ సభ్యులు, పలు ప్రజా సంఘాల నేతలు పాల్గొన్న ఈ కార్యక్రమంలో పోలీసులకు, బాధితులకు మధ్య తీవ్ర వాగ్వివాదం, తోపులాట జరగడంతో కలెక్టరేట్ వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది.

**ముఖ్యమంత్రి హామీ ఏమైంది?**

ప్రమాదం జరిగిన మరుసటి రోజే (జూలై 1, 2025) ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘటనా స్థలానికి వచ్చి ప్రతి మృతుని కుటుంబానికి కోటి రూపాయల పరిహారం అందిస్తామని హామీ ఇచ్చారని టీపీజేఏసీ నేతలు గుర్తు చేశారు. జూలై 2న కంపెనీ కూడా బీఎస్ఈ/ఎన్ఎస్ఈలలో ఇదే విషయాన్ని అధికారికంగా ప్రకటించిందని తెలిపారు. కానీ నేడు కంపెనీ తన అదనపు కౌంటర్ అఫిడవిట్‌లో ‘ఎక్స్‌గ్రేషియా’ అనే పదాన్ని పొరపాటున వాడామని పేర్కొంటూ.. కార్మికుడి హక్కులైన పీఎఫ్, ఈఎస్ఐ సొమ్మును కలిపి 42 లక్షల రూపాయలకే పరిహారాన్ని పరిమితం చేయడం అత్యంత అమానవీయమని విమర్శించారు.

**అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం**

ప్రభుత్వం నియమించిన ‘టెక్నికల్ ఎక్స్‌పర్ట్ కమిటీ’ తన నివేదికలో దిగ్భ్రాంతికరమైన విషయాలను బయటపెట్టిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. 2019 నుండి 2024 వరకు ఫ్యాక్టరీ అధికారులు నిర్వహించిన తనిఖీలు కేవలం మొక్కుబడి చర్యలేనని నివేదికలో స్పష్టమైందని ధ్వజమెత్తారు. ఇన్‌స్పెక్షన్లు చేయకుండానే సర్టిఫికెట్లు ఇవ్వడం వల్లే 54 ప్రాణాలు గాలిలో కలిశాయని మండిపడ్డారు. తమ అధికారుల వైఫల్యానికి బాధ్యత వహిస్తూ ప్రభుత్వం తక్షణమే కోటి రూపాయల నికర పరిహారాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు.

**క్షతగాత్రుల పట్ల అమానవీయత**

ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కార్మికుల పట్ల కంపెనీ, ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయని టీపీజేఏసీ ఎండగట్టింది. రాజేష్ కుమార్ చౌదరిని పూర్తిగా కోలుకోకముందే కంపెనీ ఒత్తిడితో ఆసుపత్రి నుండి బలవంతంగా డిశ్చార్జి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దివ్య, సుష్మల జీవితాలు శాశ్వతంగా ఛిద్రమయ్యాయని, మెరుగైన వైద్యం అందించకుండా కంపెనీ బిల్లులు పెండింగ్‌లో పెడుతోందని తెలిపారు. వీరికి 50 లక్షల రూపాయల పరిహారం ఇచ్చి, వైద్య బాధ్యతను ప్రభుత్వమే తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**కలెక్టరేట్ వద్ద ఉద్రిక్తత**

ధర్నా అనంతరం బాధితులు సామూహికంగా కలెక్టరేట్ లోపలికి వెళ్లి కలెక్టర్‌కు మెమోరాండం ఇవ్వడానికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో బాధితులు గేటు ముందే బైఠాయించి నిరసన తెలిపారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో చివరికి కలెక్టరేట్ ఏఓ గేటు బయటకు వచ్చి బాధితుల నుండి మెమోరాండం స్వీకరించారు. మృతుల కుటుంబాలకు పీఎఫ్, ఈఎస్ఐ కాకుండా అదనంగా కోటి రూపాయల నికర పరిహారం చెల్లించాలని, బాధితులకు ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని, నిర్లక్ష్యం వహించిన అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీపీజేఏసీ కన్వీనర్ వై అశోక్ కుమార్, రాష్ట్ర కో-కన్వీనర్ కన్నెగంటి రవి, అడ్వకేట్ వసుధ నాగరాజ్, మీరా సంఘమిత్ర, ఎంవీఎఫ్ జాతీయ కన్వీనర్ ఆర్ వెంకట్ రెడ్డి, ప్రభు గౌడ్, మల్లికార్జున్ పాటిల్, తుల్జారెడ్డి, మాణిక్యం, ఎం లక్ష్మయ్య యాదవ్ పాల్గొన్నారు.





# సదాశివపేటలో వైభవంగా మహబూబ్ పాశ దర్గా ఉర్సు

- పాల్గొన్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి
- మత సామరస్యానికి ప్రతీక ఉర్సు ఉత్సవాలు
- అలరించిన కవ్వాలి ప్రదర్శనలు
- నిర్వాహకులను అభినందించిన జగ్గారెడ్డి

**సదాశివపేట, ఏప్రిల్ 19 (జనం పవర్):** సదాశివపేట పట్టణంలోని హజరత్ మహబూబ్ పాశ దర్గాలో జరిగిన ఉర్సు ఉత్సవాల్లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పాల్గొన్నారు. గత మూడు రోజులుగా ఈ ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. హజరత్ సయ్యద్ షా మహమ్మద్ సాహబ్ 422వ ఉర్సే షరీఫ్, హజరత్ మహబూబ్ పాశ 52వ ఉర్సే షరీఫ్ ఉత్సవాలు సంయుక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గాలో జగ్గారెడ్డి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

**మత సామరస్యానికి ప్రతీక**

ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ ఉర్సు ఉత్సవాలు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. గంగా జమునా తెహజీబ్ సంస్కృతిని ఇటువంటి ఉత్సవాలు ప్రతిబింబిస్తాయని తెలిపారు. కులమతాలకు అతీతంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకోవడం సంతోషకరమన్నారు. దర్గా కమిటీ సభ్యులు ఉత్సవాలను క్రమశిక్షణతో నిర్వహించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

**అలరించిన కవ్వాలి**

ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన కవ్వాలి కార్యక్రమం ఆహూతులను విశేషంగా అలరించింది. కవ్వాలి కార్యక్రమ నిర్వాహకులను, దర్గా కమిటీ సభ్యులను జగ్గారెడ్డి ఈ సందర్భంగా శాలువాతో సన్మానించి అభినందించారు. పట్టణ ప్రజలకు, భక్తులకు ఉర్సు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దర్గా కమిటీ ప్రతినిధులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ముస్లిం మత పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# కిష్టాపూర్ 'కరెంట్' కష్టాలు!

**విద్యుత్ శాఖ తీరుపై సర్పంచ్ నరేశ్ నిప్పులు**

**లో-వోల్టేజ్ సమస్యతో ప్రజల నరకయాతన**

## విధులకు రాని లైన్ మెన్, అందుబాటులో లేని ఏఈ

## పరిష్కరించకుంటే కార్యాలయం ముట్టడి



**తుడుం జితేందర్ జనం పవర్ ఉత్తర తెలంగాణ బ్యూరో**

వెలుగులు నింపాల్సిన విద్యుత్ శాఖ నిర్లక్ష్యపు చీకట్లను పంచుతోందని జన్నారం మండలం కిష్టాపూర్ సర్పంచ్ వాసాల నరేశ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో నెలకొన్న లో-వోల్టేజ్ సమస్యపై అధికారుల మొండివైఖరిని నిరసిస్తూ ఆయన సబ్ ఇంజినీర్‌కు వినతిపత్రం సమర్పించారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు.

### వాడవాడలా వోల్టేజ్ వణుకు

గ్రామంలోని ఏస్సీ కాలనీ, నేతకాని వాడల్లో పరిస్థితి దారుణంగా తయారైందని సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాన్స్‌ఫార్మర్లపై సామర్థ్యానికి మించి లోడ్ పడటంతో వోల్టేజ్ కనిష్ఠ స్థాయికి పడిపోతోందని వివరించారు. దీనివల్ల ఫ్యాన్లు తిరగక, మోటార్లు పనిచేయక ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని ధ్వజమెత్తారు.

### అధికారుల బాధ్యతారాహిత్యం

స్థానిక విద్యుత్ సిబ్బంది తీరుపై సర్పంచ్ నరేశ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. లైన్ మెన్ మురళికి సమస్య వివరిస్తే పరిష్కరించాల్సింది పోయి నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని, విధులకు సక్రమంగా హాజరుకావడం లేదని ఆరోపించారు. క్షేత్రస్థాయిలో ఇన్ని సమస్యలు ఉన్నా ఏఈ అందుబాటులో లేకపోవడంపై మండిపడ్డారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉండి ప్రజలను ఇబ్బందులకు గురి చేయడం సరికాదని హితవు పలికారు.

### ఆందోళన హెచ్చరిక

విద్యుత్ సమస్యలపై ఏఈ తక్షణమే స్పందించి పూర్తిస్థాయిలో పరిష్కారం చూపాలని సర్పంచ్ డిమాండ్ చేశారు. ప్రజల సహనాన్ని పరీక్షించవద్దని, వెంటనే అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని కోరారు. లేనిపక్షంలో గ్రామస్తులతో కలిసి విద్యుత్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# సిద్దిపేటలో కాంగ్రెస్ నిరసన ఉద్రిక్తం!

- ముస్తాబాద్ చౌరస్తా వద్ద దిష్టిబొమ్మ దహనం
- పోలీసులతో నిరసనకారుల తోపులాట

**బీజేపీ ఎంపీ వ్యాఖ్యలపై ఆగ్రహం**



## తెలంగాణ గౌరవాన్ని దెబ్బతీస్తే సహించం: హరికృష్ణ



**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

సిద్ధిపేట పట్టణంలోని ముస్తాబాద్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ కార్యకర్తలు భారీ ఎత్తున నిరసన చేపట్టడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. తెలంగాణపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ ఎంపీపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ సిద్ధిపేట పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఈ నిరసన జరిగింది. కార్యకర్తలు బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ దిష్టిబొమ్మను దహనం చేసేందుకు ప్రయత్నించారు.

### పోలీసులతో తోపులాట

దిష్టిబొమ్మను దహనం చేసే క్రమంలో పోలీసులు అడ్డుకోవడంతో నిరసనకారులు, పోలీసుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో కొంతసేపు అక్కడ గందరగోళం నెలకొంది. వన్ టౌన్ పోలీస్ సిబ్బంది వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి ప్రయత్నించారు. పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి నిరసనను నియంత్రించారు.

### తెలంగాణ గౌరవమే ముఖ్యం

ఈ సందర్భంగా సిద్ధిపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ పూజాల హరికృష్ణ మాట్లాడుతూ తెలంగాణ గౌరవాన్ని దెబ్బతీసే విధంగా వ్యాఖ్యలు చేసే వారిని సహించబోమని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అత్తు ఇమాముద్దీన్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి, గయాస్ ఉద్దీన్, పూజల గోపికృష్ణ, మార్క సతీష్, బాబా హర్షిత్, విజయ్, డానియల్, రషీద్, రాజిరెడ్డి, షేక్ భాస్కాన్, స్రవంతి పాల్గొన్నారు.



# ఆరెపల్లిలో ఐకేపీ సెంటర్ ప్రారంభం

**మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం**

**ప్రారంభించిన మార్కెట్ కమిటీ చైర్మన్ నిర్మల జయరాజ్, సర్పంచ్ బాబు రాజు**

**మహిళా సాధికారతకు కొత్త దిశ**

**రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు**



**కోహెడ , ఏప్రిల్ 19 (జనం పవర్):** సిద్దిపేట జిల్లా కోహెడ మండలం ఆరెపల్లి గ్రామంలో ఐకేపీ సెంటర్‌ను గ్రామ సర్పంచ్ బాబు రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ నిర్మల జయరాజ్ కలిసి ప్రారంభించారు. గ్రామ అభివృద్ధి, మహిళా సాధికారత లక్ష్యంగా ఏర్పాటు చేసిన ఈ కేంద్రం ప్రారంభోత్సవంలో వైస్ చైర్మన్ తిరుపతి రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల సభ్యులు, రైతులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఐకేపీ సెంటర్ గ్రామ మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ఒక మంచి వేదికగా నిలుస్తుందని సర్పంచ్ బాబు రాజు తెలిపారు. మహిళా సంఘాల ద్వారా స్వయం ఉపాధి అవకాశాలు పెరిగి, కుటుంబాల ఆర్థిక స్థితి మెరుగుపడుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని మహిళలు స్వయం సమృద్ధి సాధించాలని సూచించారు. గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగంగా అమలు చేయడానికి అందరి సహకారం అవసరమని కోరారు. గ్రామ ప్రజలు ఐక్యంగా పనిచేస్తే ఆరెపల్లి అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని సర్పంచ్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఐకేపీ సెంటర్ ప్రారంభం తమకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, ఉపాధి అవకాశాలు పెరగడం ద్వారా తమ జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని మహిళా సంఘాల సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కేంద్రం ద్వారా గ్రామంలో మహిళా సాధికారతకు కొత్త దిశ ఏర్పడుతుందని స్థానికులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ గోండా నర్సింగరావు, పంచాయతీ కార్యదర్శి వినయ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మంద ధర్మయ్య, ఆత్మ కమిటీ డైరెక్టర్ లింగం గౌడ్, ఏపీఎం శ్రీనివాస్, జీపీఓ యాదగిరి, లాసాని గీత, గోండా అర్చన పాల్గొన్నారు. మహిళా సంఘాల సభ్యులు, రైతులు, యువకులు, హమాలీ సంఘం సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# విద్యతోనే సమాజ మార్పు!

**అందోల్‌ను ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతాం**

**మంత్రి దామోదర్ రాజనర్సింహ సుడిగాలి పర్యటన**

**రూ. 27.76 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం**

**కలెక్టర్ ప్రావీణ్యతో కలిసి ప్రారంభోత్సవాలు**



**సంగారెడ్డి, ఏప్రిల్ 19 (జనం పవర్):** విద్యే సమాజాన్ని మార్చే శక్తివంతమైన ఆయుధమని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. శనివారం అందోల్ నియోజకవర్గంలో నిర్వహించిన సుడిగాలి పర్యటనలో భాగంగా విద్యా అభివృద్ధి, మౌలిక వసతుల పెంపుపై ఆయన దృష్టి సారించారు. శివంపేట పాలిటెక్నిక్ కళాశాలలో న్యూ హాలాండ్ పరిశ్రమ సీఎస్ఆర్ నిధులు 43 లక్షల రూపాయలతో నిర్మించిన మెకానికల్ వర్క్‌షాప్ షెడ్‌ను జిల్లా కలెక్టర్ పీ ప్రావీణ్యతో కలిసి మంత్రి ప్రారంభించారు. విద్యతోనే జీవితాల్లో వెలుగులు నిండుతాయని, అందోల్ నియోజకవర్గాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. నియోజకవర్గంలో ఇప్పటికే పాలిటెక్నిక్, జేఎన్టీయూ ఇంజనీరింగ్, ఫార్మసీ, నర్సింగ్, వ్యవసాయ, మహిళా కళాశాలలతో పాటు మోడల్, రెసిడెన్షియల్, కస్తూర్బా పాఠశాలలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. బాలికల భద్రత, వసతుల విషయంలో రాజీ లేదని స్పష్టం చేశారు. సీఎస్ఆర్ నిధులు 10 కోట్ల రూపాయలతో నియోజకవర్గంలోని విద్యాసంస్థలలో మౌలిక వసతుల మెరుగుదల పనులు చేపడుతున్నట్లు వివరించారు.

### అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మంత్రి తన పర్యటనలో భాగంగా 27.76 కోట్ల రూపాయల విలువైన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. అందోల్‌లో 1.80 కోట్ల రూపాయలతో నిర్మించిన విద్యుత్ ఉపకేంద్రాన్ని ప్రారంభించగా, చెరువు కట్ట వద్ద 5 కోట్ల రూపాయలతో నిర్మించనున్న పర్యాటక రెస్టారెంట్‌కు శంకుస్థాపన చేశారు. 20 కోట్ల రూపాయలతో నిర్మించనున్న ప్రభుత్వ కార్యాలయాల సముదాయం పనులను ప్రారంభించారు. 53 లక్షల రూపాయలతో నిర్మించిన గ్రంథాలయ భవనం మొదటి అంతస్తును ప్రారంభించారు.

### నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

విద్యార్థులు విద్యతో పాటు నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుంటే ఉపాధి అవకాశాలు విస్తృతమవుతాయని జిల్లా కలెక్టర్ పీ ప్రావీణ్య సూచించారు. పాలిటెక్నిక్ విద్యార్థులు ఉన్నత విద్యతో పాటు ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాండు, ప్రిన్సిపాల్ నారాయణ గౌడ్, న్యూ హాలాండ్ ఫౌండేషన్ ప్రతినిధి డీవీ రెడ్డి, సర్పంచ్ సంధ్యా రాణి, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.




# సిద్ధిపేటలో ఉచిత మెగా వైద్య శిబిరం

**బీడీ కాలనీలో ఆరోగ్య చైతన్యం**

**ఎమ్మెల్యే హరీష్ రావు ఆదేశాల మేరకు నిర్వహణ**

**నిపుణులైన డాక్టర్ల చేత వైద్య పరీక్షలు**

**భారీగా తరలివచ్చిన 13వ వార్డు ప్రజలు**



**సిద్ధిపేట, ఏప్రిల్ 19 (జనం పవర్):** సిద్ధిపేట పట్టణంలోని 13వ వార్డు, బీడీ కాలనీ, హనుమాన్ గుడి సమీపంలో ఉన్న బీఆర్ఎస్ కార్యాలయం ఎదురుగా శనివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించబడింది. ఈ శిబిరాన్ని డాక్టర్ అగర్వాల్ కంటి ఆసుపత్రి, వెంకటేశ్వర నర్సింగ్ హోమ్ సంయుక్తంగా ఏర్పాటు చేశాయి. మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే టీ హరీష్ రావు ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టారు. స్థానిక కౌన్సిలర్ విఠోబా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. శిబిరంలో కంటి పరీక్షలు, రక్తపోటు, షుగర్ పరీక్షలు, అలాగే స్త్రీలకు సంబంధించిన ప్రత్యేక వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రసూతి, స్త్రీల వైద్య నిపుణురాలు డాక్టర్ యూ కావేరి, 13వ వార్డు బీఆర్ఎస్ నాయకుడు పత్రి శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరానికి స్థానిక ప్రజలు విశేషంగా హాజరై, అందించిన సేవలను వినియోగించుకున్నారు. ఈ కార్యక్రమంలో పత్రి పరుశురాములు, చింతమడక రాజయ్య, షకీల్, సైఫ్, ఎండీ అన్వర్, బషీర్, ఆయిల్ రెడ్డి, కౌన్సిలర్ విఠోబా, టీ శ్రీనివాస్ యాదవ్, కంటెం రాజు, దొంతుల సురేష్, బాలమణి, లత, జంగం రాణి, రాధిక, బంక పరుశరాము, ముఖిల్ పాల్గొన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ఇటువంటి మరిన్ని శిబిరాలు నిర్వహిస్తామని నిర్వాహకులు ఈ సందర్భంగా తెలిపారు.

# సంగారెడ్డిలో కాంగ్రెస్ భారీ ర్యాలీ

**డీలిమిటేషన్ బిల్లుపై జగ్గారెడ్డి ఆగ్రహం**

**బిల్లుల ప్రతులను దహనం చేసిన కార్యకర్తలు**

**ప్రజల హక్కుల పరిరక్షణే లక్ష్యమన్న టీపీసీసీ నేత**

**రాహుల్ గాంధీ పోరాటానికి మద్దతు ఇవ్వాలని పిలుపు**





**సంగారెడ్డి, ఏప్రిల్ 19 (జనం పవర్):** డీలిమిటేషన్ బిల్, మహిళా బిల్లులో ఉన్న లోపాలను సరిదిద్దాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంగారెడ్డి పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఐబీ నుండి పాత బస్ స్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వరకు ఈ ర్యాలీ కొనసాగింది. అనంతరం పార్టీ కార్యకర్తలు బిల్లుల ప్రతులను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలపై తీవ్ర విమర్శలు చేశారు. దేశ ప్రజల హక్కులను కాపాడేందుకు బీఆర్ అంబేద్కర్ చేసిన కృషిని గుర్తుచేశారు. కేంద్రంలో నరేంద్ర మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం ప్రజల హక్కులను తగ్గించే విధంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. డీలిమిటేషన్ ప్రక్రియను ఇష్టానుసారంగా నిర్వహిస్తే దేశానికి నష్టం కలుగుతుందని రాహుల్ గాంధీ ఇప్పటికే హెచ్చరించారని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ దేశ ప్రజల సమస్యలను దగ్గరగా తెలుసుకోవడానికి జోడో యాత్ర, న్యాయ యాత్రల ద్వారా వేల కిలోమీటర్లు పాదయాత్రలు చేశారని, ఆయన ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని తెలిపారు. మరోవైపు పార్లమెంట్‌లో ప్రజల సమస్యలపై చర్చించడానికి తగిన అవకాశాలు ఇవ్వడం లేదని విమర్శించారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత బంగారం, పెట్రోలు, డీజిల్, ఎరువులు వంటి అనేక వస్తువుల ధరలు పెరిగాయని, రైతులకు అనుకూలమైన పథకాలు అమలు కావడం లేదని ఆరోపించారు. తమ హక్కుల పరిరక్షణ కోసం ప్రజలు చైతన్యంగా ఉండాలని జగ్గారెడ్డి పిలుపునిచ్చారు.

# బసవ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించాలి

**సమానత్వానికి ప్రతీక బసవేశ్వరుడు**

**శ్రమకు గౌరవం ఇచ్చిన మహనీయుడు**

**ఆయన బోధనలు నేటికీ స్ఫూర్తిదాయకం**



**సంగారెడ్డి, ఏప్రిల్ 19 (జనం పవర్):** జిల్లా వ్యాప్తంగా శ్రీ విశ్వగురు మహాత్మ బసవేశ్వరుడి 893వ జయంతి ఉత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించాలని వీరశైవ సమాజం జిల్లా అధ్యక్షుడు ఇప్పపల్లి నర్సింహులు కోరారు. జిల్లా కేంద్రం, మున్సిపాలిటీలు, మండలాల్లో అధికారులు సమన్వయంతో కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. బసవేశ్వరుడు సమానత్వానికి ప్రతీకగా నిలిచి కుల వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడి "కాయకమే కైలాసం" అనే సూత్రంతో శ్రమకు గౌరవం ఇచ్చారని నర్సింహులు తెలిపారు. ఆయన బోధనలు నేటికీ సమాజానికి స్ఫూర్తిగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. బసవన్న చూపిన బాటలో ప్రతి ఒక్కరూ పయనించాలని ఆకాంక్షించారు.





# ఫసల్వాదిలో ఆధ్యాత్మిక వేడుకలు

- 20న ఆద్యశిల మహోత్సవం
- 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం
- శిలలపై బీజాక్షరాల లేఖనం
- విద్యాపీఠం అభివృద్ధికి కీలక ఘట్టం

**సంగారెడ్డి, ఏప్రిల్ 19 (జనం పవర్):** సంగారెడ్డి మండలం ఫసల్వాదిలోని శ్రీ జ్యోతిర్వాస్తు విద్యాపీఠం ఈ నెల 20వ తేదీన విశేష ఆధ్యాత్మిక వేడుకలకు వేదిక కానుంది. ఆద్యశిల స్థాపనోత్సవ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ కార్యక్రమం భక్తుల ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా నిర్వహిస్తున్నట్లు వ్యవస్థాపకులు డాక్టర్ మహేశ్వర శర్మ సిద్ధాంతి తెలిపారు. శనివారం ఆశ్రమంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ మహోత్సవం ప్రత్యేకతగా అష్టోత్తర శతావర్తన హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం జరుగుతుందని వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆధ్యాత్మిక అనుభూతిని పొందాలని ఆయన ఆకాంక్షించారు. మహోత్సవంలో భాగంగా సాయంత్రం 5 గంటలకు భక్తులచే శిలలపై బీజాక్షరాలు రాయించే విశిష్ట కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా ఆశ్రమ నిర్మాణానికి ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను చేకూర్చే ప్రయత్నం చేస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. విద్యాపీఠం అభివృద్ధి దిశగా ఈ ఆద్యశిల స్థాపనోత్సవం ఒక కీలక ఘట్టంగా నిలుస్తుందని, భవిష్యత్తులో మరిన్ని ధార్మిక, విద్యా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యాపీఠం సభ్యులు తోపాజి అనంత కిషన్, నీలం మధు, ప్రశాంత్ కుమార్, సెంథిల్ పాల్గొన్నారు.

# బసవేశ్వర జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి

- సమానత్వానికి ప్రతీక విశ్వగురు బసవన్న
- జిల్లా వ్యాప్తంగా అధికారికంగా ఏర్పాట్లు చేయాలి
- మాజీ ప్రధాన కార్యదర్శి అన్నిశెట్టి జయప్రకాశ్ డిమాండ్


**సంగారెడ్డి, ఏప్రిల్ 19 (జనం పవర్):** జిల్లా వ్యాప్తంగా శ్రీ విశ్వగురు మహాత్మ బసవేశ్వర 893వ జయంతి ఉత్సవాలను సోమవారం అధికారికంగా ఘనంగా నిర్వహించాలని జిల్లా గౌరవ సలహాదారు, మాజీ ప్రధాన కార్యదర్శి అన్నిశెట్టి జయప్రకాశ్ కోరారు. జిల్లా ప్రధాన కేంద్రం, మున్సిపాలిటీలు, మండల కేంద్రాల్లో అధికారులు ఈ కార్యక్రమాలను సమన్వయంతో నిర్వహించాలని ఆయన సూచించారు.

**సామాజిక సంస్కర్త బసవేశ్వరుడు**

12వ శతాబ్దంలో వెలుగొందిన మహాత్మ గురు బసవేశ్వరుడు గొప్ప సామాజిక సంస్కర్త, తత్వవేత్త అని జయప్రకాశ్ పేర్కొన్నారు. సమానత్వానికి ప్రతీకగా నిలిచిన ఆయన కులవ్యవస్థ, అంటరానితనం వంటి సామాజిక అన్యాయాలపై ధైర్యంగా పోరాడారని తెలిపారు. "కాయకమే కైలాసం" అనే మహాసూత్రంతో శ్రమకు గౌరవం ఇచ్చి ప్రతి మనిషి సమానుడనే భావనను సమాజంలో స్థాపించారని చెప్పారు.

**అనుభవ మంటపం ద్వారా జ్ఞానబోధ**

అనుభవ మంటపం ద్వారా జ్ఞానం, ధర్మం, న్యాయం వంటి విలువలను వ్యాప్తి చేసి సమాజానికి మార్గదర్శకుడిగా బసవన్న నిలిచారని వివరించారు. ఆ కాలంలోనే మహిళలకు సమాన హక్కులు కల్పించి, అనుభవ మంటపంలో వారికి ప్రాధాన్యం ఇచ్చిన మహానుభావుడిగా చరిత్రలో నిలిచారని తెలిపారు. ఆయన బోధనలు నేటికీ కోట్ల మందికి స్ఫూర్తినిస్తూ సమానత్వం, మానవత్వానికి చిరస్మరణీయ చిహ్నంగా నిలుస్తున్నాయని అన్నారు.



# నారాయణఖేడ్‌లో బెల్ట్ షాపుల జోరు!

## వైన్స్ అండతోనే అక్రమ దందా

## 24 గంటలు ఏరులై పారుతున్న మద్యం

**పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు**

**గ్రామాల్లో విచ్చలవిడిగా విక్రయాలు**



**నారాయణఖేడ్, ఏప్రిల్ 18 (జనం పవర్):** నారాయణఖేడ్ మండలంలో బెల్ట్ షాపులు విచ్చలవిడిగా పెరిగి మద్యం ఏరులై పారుతోంది. వైన్స్ దుకాణదారుల అండతో అక్రమంగా బెల్ట్ షాపులు నడుస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. మండలంలోని దాదాపు ప్రతి గ్రామంలో బెల్ట్ షాపులు ఏర్పడటం సాధారణమైపోయింది. మెడికల్ దుకాణం లేకపోయినా ప్రతి వీధిలో బెల్ట్ షాపు ఉందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అధికారుల నిర్లక్ష్యం**

ఎన్నికల సమయంలో మాత్రమే పోలీసులు, ఎక్సైజ్ అధికారులు నామమాత్రంగా చర్యలు తీసుకుని అనంతరం పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. ముఖ్యంగా నారాయణఖేడ్ మున్సిపల్ పరిధిలోని బైపాస్ రోడ్డు, కరస్‌గుత్తి రోడ్డు, ర్యాకల్ రోడ్డు, మంగళ్‌పేట్ ప్రాంతాల్లో బెల్ట్ షాపులు విస్తరించినా అధికారులు చూస్తూ ఊరుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. వైన్స్ నిర్వాహకులు బెల్ట్ షాపులకు మద్యం సరఫరా చేస్తూ భరోసా ఇస్తున్నారనే ప్రచారం జరుగుతోంది.

**అదనపు ధరల బాదుడు**

బెల్ట్ షాపులు ప్రతి బాటిల్‌పై 20 రూపాయల నుండి 50 రూపాయల వరకు అదనంగా వసూలు చేస్తున్నాయి. కొన్ని వైన్స్ దుకాణాల్లో బెల్ట్ షాపుల కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారని వాదనలు వినిపిస్తున్నాయి. చట్టం ప్రకారం ఒక వ్యక్తికి పరిమిత మోతాదులోనే మద్యం విక్రయించాలి. కానీ బెల్ట్ షాపుల నిర్వాహకులకు పరిమితి మించి సరఫరా జరుగుతోంది. వైన్స్ దుకాణాలు రాత్రి 10 గంటలకు మూసివేస్తున్నా బెల్ట్ షాపుల్లో మాత్రం 24 గంటలు మద్యం లభిస్తోంది. ఇప్పటికైనా అధికారులు బాధ్యతగా వ్యవహరించి బెల్ట్ షాపులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.





# సన్‌రైజర్స్ సత్తా!



**హైదరాబాద్, ఏప్రిల్ 18:** సొంత గడ్డపై సన్ రైజర్స్ హైదరాబాద్ (ఎస్ ఆర్ హెచ్) సత్తా చాటింది. ఉప్పల్ లోని రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంలో శనివారం జరిగిన ఉత్కంఠ పోరులో చెన్నై సూపర్ కింగ్స్ (సీ ఎస్ కే) పై 10 పరుగుల తేడాతో అద్భుత విజయం సాధించింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన ఎస్ ఆర్ హెచ్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 194 పరుగులు చేసింది. లక్ష్య ఛేదనలో సీ ఎస్ కే పోరాడినా.. నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 184 పరుగులకే పరిమితమైంది. బ్యాటింగ్ లో అభిషేక్ శర్మ, బౌలింగ్ లో ఈషాన్ మలింగ అద్భుత ప్రదర్శనతో సన్ రైజర్స్ కు విజయాన్ని అందించారు.

## ఆకాశమే హద్దుగా అభిషేక్, క్లాసెన్

మొదట బ్యాటింగ్ కు దిగిన సన్ రైజర్స్ కు ఓపెనర్లు అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్ అదిరిపోయే ఆరంభాన్నిచ్చారు. ముఖ్యంగా అభిషేక్ శర్మ చెన్నై బౌలర్లపై విరుచుకుపడ్డాడు. కేవలం 22 బంతుల్లోనే 59 పరుగులు చేసి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. ట్రావిస్ హెడ్ 20 బంతుల్లో 23 పరుగులు చేసి రాణించాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన హెన్రిచ్ క్లాసెన్ బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. 39 బంతుల్లో 59 పరుగులు చేసి జట్టు భారీ స్కోరుకు బాటలు వేశాడు. చివర్లో వికెట్లు పడినా.. సన్ రైజర్స్ 194 పరుగుల భారీ స్కోరు సాధించింది. సీ ఎస్ కే బౌలర్లలో అన్షుల్ కంబోజ్ 3 ఓవర్లలో 22 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టాడు. జేమీ ఓవర్టన్ 4 ఓవర్లలో 37 పరుగులిచ్చి 3 వికెట్లు దక్కించుకున్నాడు. ముకేశ్ చౌదరి 2 వికెట్లు తీశాడు.



## తడబడిన చెన్నై ఛేదన

195 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన చెన్నై సూపర్ కింగ్స్ కు ఆశించిన ఆరంభం లభించలేదు. సన్ రైజర్స్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో చెన్నై బ్యాటర్లు భారీ షాట్లు ఆడేందుకు ఇబ్బంది పడ్డారు. ఓపెనర్ మ్యాట్ షార్ట్ 30 బంతుల్లో 34 పరుగులు చేసి కాస్త పోరాడాడు. మిడిలార్డర్ లో కుర్రాడు ఆయుష్ మ్హాత్రే 13 బంతుల్లోనే 30 పరుగులు చేసి ఆశలు రేపాడు. సర్ఫరాజ్ ఖాన్ 19 బంతుల్లో 25 పరుగులు చేశాడు. వీరు మినహా మిగతా బ్యాటర్లు ఎవరూ భారీ స్కోర్లు చేయలేకపోవడంతో చెన్నైకి ఓటమి తప్పలేదు.

## కట్టడి చేసిన బౌలర్లు

సన్ రైజర్స్ బౌలర్లు సమిష్టిగా రాణించి జట్టుకు విజయాన్ని ఖాయం చేశారు. ఈషాన్ మలింగ తన 4 ఓవర్ల కోటాలో 29 పరుగులు మాత్రమే ఇచ్చి 3 కీలక వికెట్లు పడగొట్టాడు. యువ పేసర్ నితీశ్ కుమార్ రెడ్డి 4 ఓవర్లలో 31 పరుగులిచ్చి 2 వికెట్లు తీశాడు. శివాంగ్ కుమార్ తన 3 ఓవర్ల స్పెల్ లో కేవలం 18 పరుగులు ఇచ్చి ఒక వికెట్ దక్కించుకుని చెన్నై బ్యాటర్లను కట్టడి చేశాడు. బౌలర్ల సమష్టి కృషితో సన్ రైజర్స్ సొంత మైదానంలో అభిమానులకు ఉత్కంఠ విజయాన్ని కానుకగా ఇచ్చింది.



# ఢిల్లీ ధమాకా!

- ఆఖరి బంతి ముంగిట డీసీ విజయం
- నిలిచిన స్టబ్స్, రాహుల్ క్రీజు పోరాటం
- సత్తా చాటిన ఢిల్లీ స్పిన్నర్లు
- సాల్ట్ మెరుపులు, కోహ్లీ శ్రమ వృథా
- ఆకట్టుకున్న ట్రిస్టన్ స్టబ్స్ ఆటతీరు

**బెంగళూరుకు తప్పని పరాజయం**



**బెంగళూరు, ఏప్రిల్ 18:** ఐపీఎల్ లో మరో ఉత్కంఠ భరిత మ్యాచ్ అభిమానులను మునివేళ్లపై నిలబెట్టింది. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో శనివారం జరిగిన మ్యాచ్ లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) పై ఢిల్లీ క్యాపిటల్స్ (డీసీ) ఆరు వికెట్ల తేడాతో అద్భుత విజయం సాధించింది. ఆఖరి ఓవర్ వరకు నరాలు తెగే ఉత్కంఠ నడుమ సాగిన ఈ పోరులో ఢిల్లీ కేవలం ఒక బంతి మిగిలి ఉండగానే లక్ష్యాన్ని ఛేదించింది. మొదట బ్యాటింగ్ చేసిన ఆర్సీబీ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 175 పరుగులు చేయగా.. లక్ష్య ఛేదనలో డీసీ 19.5 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 179 పరుగులు చేసి విజయాన్ని సొంతం చేసుకుంది. ఒత్తిడిని జయించి అజేయ అర్ధ సెంచరీతో జట్టును గెలిపించిన ట్రిస్టన్ స్టబ్స్ కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కింది.

## సాల్ట్ మెరిసినా.. తడబడిన మిడిలార్డర్

టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్ కు దిగిన ఆర్సీబీ కి ఓపెనర్ ఫిల్ సాల్ట్ అద్భుతమైన ఆరంభాన్ని ఇచ్చాడు. కేవలం 38 బంతుల్లోనే 63 పరుగులు చేసి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. విరాట్ కోహ్లీ (13 బంతుల్లో 19) కాసేపు మెరుపులు మెరిపించాడు. ఒక దశలో ఆర్సీబీ భారీ స్కోరు చేసేలా కనిపించింది. అయితే డీసీ స్పిన్నర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో మిడిలార్డర్ తడబడింది. చివర్లో టిమ్ డేవిడ్ (17 బంతుల్లో 26) రాణించడంతో ఆర్సీబీ 175 పరుగుల గౌరవప్రదమైన స్కోరు చేయగలిగింది. డీసీ బౌలర్లలో అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, లుంగి ఎంగిడి తలా రెండు వికెట్లు పడగొట్టి ప్రత్యర్థి బ్యాటర్లను కట్టడి చేశారు.

## రాహుల్ మెరుపులు.. స్టబ్స్ ఫినిషింగ్

176 పరుగుల లక్ష్య ఛేదనలో ఢిల్లీ క్యాపిటల్స్ కు ఓపెనర్ కేఎల్ రాహుల్ అదిరిపోయే ఆరంభాన్నిచ్చాడు. ఆర్సీబీ బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ 34 బంతుల్లోనే 57 పరుగులు చేసి ఇన్నింగ్స్ కు గట్టి పునాది వేశాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన ట్రిస్టన్ స్టబ్స్ బాధ్యతాయుతంగా ఆడాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా ఏమాత్రం తొందరపడకుండా అక్షర్ పటేల్ (19 బంతుల్లో 26) తో కలిసి విలువైన భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. భువనేశ్వర్ కుమార్ (4 ఓవర్లలో 3/26) అద్భుతమైన బౌలింగ్ తో ఢిల్లీని దెబ్బకొట్టే ప్రయత్నం చేశాడు. కానీ స్టబ్స్ (47 బంతుల్లో 60 నాటౌట్) క్రీజులో పాతుకుపోయి మ్యాచ్ ను విజయవంతంగా ముగించాడు. ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్లో విజయానికి పరుగులు అవసరమైన దశలో రోమారియో షెఫర్డ్ బౌలింగ్ లో లాంఛనాన్ని పూర్తి చేశాడు.

## రస్ట్ రెడ్ లుక్‌లో అదరగొట్టిన

# 'ఫౌజీ' లేడీ





కన్నడ సినీ ప్రపంచంలో 'సప్త సాగరాలు దాటి సైడ్ బి' చిత్రంతో తన నటనకు మంచి గుర్తింపు తెచ్చుకున్న చైత్ర జే ఆచార్ ఇప్పుడు తన కెరీర్‌లో కీలక మలుపు దిశగా అడుగులు వేస్తోందని టాక్ వినిపిస్తోంది. టాలెంటెడ్ యాక్ట్రెస్‌గా పేరొందిన ఆమె, త్వరలోనే టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇవ్వబోతుందనే వార్తలు ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. సూపర్ స్టార్ ప్రభాస్ నటిస్తున్న భారీ బడ్జెట్ చిత్రం 'ఫౌజీ'లో చైత్రకు అవకాశం దక్కినట్లు ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో ఆమె కీలక పాత్రలో కనిపించనుందని సమాచారం. ఇదే నిజమైతే, చైత్రకు ఇది తెలుగు తెరపై ఎంతో ఆసక్తికరమైన డెబ్యూ అవుతుంది. 1940ల కాలనీయ భారతదేశం నేపథ్యంగా రూపొందుతున్న 'ఫౌజీ' ఒక పీరియడ్ డ్రామాగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఈ సినిమాలో ఇమాన్వి కూడా ముఖ్య పాత్రలో నటిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక చైత్ర ఇటీవల రస్ట్ రెడ్ అవుట్‌ఫిట్‌లో కనిపించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. సింపుల్ స్టైల్‌తోనే ఎలిగెంట్ లుక్‌ను ప్రెజెంట్ చేస్తూ ఆమె అందం అభిమానులను ఆకట్టుకుంటోంది. నటనతో పాటు స్టైల్‌లోనూ మెప్పిస్తున్న చైత్ర, 'ఫౌజీ'తో టాలీవుడ్‌లో ఎలాంటి ముద్ర వేస్తుందో చూడాలి. ఈ సినిమా 2026 చివరలో లేదా 2027లో విడుదలయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం.



## అందంలో సూపర్ హిట్...

# సక్సెస్ యావరేజ్

మోడలింగ్ నుంచి వెండితెరకు వచ్చిన దివ్యభారతి తన అందం, స్టైల్‌తో తొలినాళ్లలోనే ప్రత్యేక గుర్తింపు సంపాదించింది. కానీ తొలి సినిమా తర్వాత రావాల్సిన అవకాశాలు ఆలస్యమవడంతో ఆమె కెరీర్ ఊహించినంత వేగంగా ముందుకు సాగలేదు. దీంతో ఆమె దగ్గర ఉన్న ప్రతిభ పూర్తిగా బయటపడే అవకాశాలు ఇంకా దక్కలేదనే అభిప్రాయం సినీ వర్గాల్లో వినిపిస్తోంది. సినిమాల్లో విరామం కనిపించినప్పటికీ, సోషల్ మీడియాలో మాత్రం ఆమె ప్రభావం ఏమాత్రం తగ్గలేదు. ఇటీవల రాయల్ బ్లూ గౌన్‌లో చేసిన ఫోటోషూట్‌లో ఆమె అందం మరింత హైలైట్ అయింది. సాదాసీదా లుక్‌లోనూ ఆకట్టుకునే గ్లామర్‌తో అభిమానులను మంత్రముగ్ధులను చేసింది. కెమెరా ముందు ఆమె చూపించే ఆత్మవిశ్వాసం, ప్రెజెన్స్ మాత్రం ఎప్పటికీ తగ్గదని మరోసారి స్పష్టమైంది. అయితే నిజమైన గుర్తింపు మాత్రం ఒక పెద్ద విజయంతోనే వస్తుంది. సరైన కథ, బలమైన పాత్ర దొరికితే దివ్యభారతి బాక్సాఫీస్ వద్ద సత్తా చాటడం కష్టమేమీ కాదని ఇండస్ట్రీ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పటివరకు అందంతో ఆకట్టుకున్న ఆమె, కెరీర్‌లో కూడా అదే స్థాయి విజయాన్ని ఎప్పుడు అందుకుంటుందో చూడాల్సి ఉంది.



## సల్మాన్‌లో వంశీ పైడిపల్లి మూవీ



బాలీవుడ్ సూపర్ స్టార్ సల్మాన్ ఖాన్ మరియు టాలీవుడ్ సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ వంశీ పైడిపల్లి కాంబినేషన్‌లో తెరకెక్కనున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ శనివారం పట్టాలెక్కింది. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై అగ్ర నిర్మాత దిల్‌రాజు నిర్మిస్తున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రం రెగ్యులర్ షూటింగ్ నేటి నుంచి ప్రారంభమైనట్లు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. ఈ ప్రాజెక్టులో 'లేడీ సూపర్ స్టార్' నయనతార కథానాయికగా నటిస్తుండటంతో అంచనాలు అప్పుడే ఆకాశాన్ని తాకాయి. బాలీవుడ్ కండల వీరుడు సల్మాన్ ఖాన్, వంశీ పైడిపల్లి డైరెక్షన్‌లో నటించడం ఇదే మొదటిసారి కావడంతో ఈ పాన్-ఇండియా చిత్రంపై దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. ఈ నెలనుంచే షూటింగ్ మొదలవుతుందని గతంలోనే ప్రకటించిన చిత్ర బృందం, ఈరోజు నుంచి కెమెరా ముందుకు వెళు _న్నట్లు వెల్లడించింది. యాక్షన్ మరియు ఎమోషన్స్ కలయికగా రానున్న ఈ చిత్రం 2027 ప్రథమార్ధంలో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉంది.


## వారణాసి కోసం పాట చిత్రీకరణ

కథానాయకుడు మహేశ్‌బాబు.. దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి కలయికలో రూపొందుతున్న బహుభాషా చిత్రం 'వారణాసి'. ఈ సినిమా గత కొన్నిరోజులుగా హైదరాబాద్‌లో చిత్రీకరణ చేసుకుంటున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు ఇక్కడే ప్రత్యేకంగా సిద్ధం చేసిన ఓ భారీ సెట్‌లో పాట చిత్రీకరణ చేస్తున్నట్లు సమాచారం. దీనికి ప్రముఖ కొరియోగ్రాఫర్ బాస్కో మార్టిన్ నృత్యరీతులు అందిస్తున్నట్లు తెలిసింది. ఈ పాట చిత్రీకరణ పూర్తయ్యాక చిత్ర బృందం మే నెలంతా విరామం తీసుకోనుందని.. జూన్‌లో షూట్ తిరిగి ప్రారంభించనున్నారని తెలుస్తోంది. వివిధ యుగాలతో ముడిపడి సాగే ఆసక్తికర కథతో ఈ సినిమా ముస్తాబవుతుండగా.. మహేశ్ దీంట్లో శ్రీరాముడిగా, రుద్రగా రెండు పాత్రల్లో అలరించనున్నారు. ఈ చిత్రం వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. కేఎల్ నారాయణ, ఎస్ఎస్ కార్తికేయ నిర్మిస్తున్నారు. ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాకి సంగీతం: ఎంఎం కీరవాణి, కథ: కె విజయేంద్ర ప్రసాద్, ఎస్ఎస్ కంచి, మాటలు: దేవ కట్టా, ఛాయాగ్రహణం: పీఎస్ వినోద్.

## బన్నీలో ఆ గ్రేస్ చాలా ఇష్టం

తెలుగు ప్రేక్షకులకు 'ఉయ్యాలా జంపాల' సినిమాతో దగ్గరైన అవికా గోర్, తన నటనతో మంచి గుర్తింపు సంపాదించుకుంది. ప్రస్తుతం విభిన్నమైన కథలను ఎంపిక చేసుకుంటూ ముందుకు సాగుతున్న ఈ నటి, తాజాగా ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌పై తన అభిమానం వ్యక్తం చేసింది. ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, బన్నీ డాన్స్ స్టైల్ తనను ఎంతగానో ఆకట్టుకుంటుందని చెప్పింది. ముఖ్యంగా ఆయనలో కనిపించే గ్రేస్ చాలా ప్రత్యేకమని, అదే తనకు అత్యంత ఇష్టమని పేర్కొంది. "డాన్స్‌లో ఆయన చూపించే ఆ ఫ్లో, ఈజ్ చాలా అద్భుతంగా ఉంటుంది. అలాంటి గ్రేస్ ప్రతి ఒక్కరికి సాధ్యం కాదు" అని ఆమె తెలిపింది. అల్లు అర్జున్ కేవలం డాన్స్‌లోనే కాకుండా, తనను తాను తీర్చిదిద్దుకునే విధానంలోనూ ఎంతో ప్రేరణనిస్తారని అవికా చెప్పింది. ఆయనలో ఉండే ఎనర్జీ, పాజిటివ్ వైబ్ తనను బాగా ఆకట్టుకుంటాయని పేర్కొంది. సెల్ఫ్ మేడ్ స్టార్‌గా ఎదిగిన బన్నీ ప్రయాణం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని ఆమె అభిప్రాయపడింది. ప్రస్తుతం అవికా చేసిన ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతూ, అభిమానుల్లో చర్చకు దారితీస్తున్నాయి.





## గోల్డ్ లుక్‌లో గ్లామర్ షో..

# ప్రగ్యా హాట్ హంగామా!

ప్రగ్యా జైస్వాల్ మరోసారి తన గ్లామర్‌తో సోషల్ మీడియాను షేక్ చేసింది. సినిమాల్లో అందంతో ఆకట్టుకునే ఈ బ్యూటీ, ఆఫ్‌స్క్రీన్‌లోనూ అదే స్టైల్‌ను కొనసాగిస్తూ అభిమానులను మెప్పిస్తోంది. తాజాగా ఆమె షేర్ చేసిన ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఈ ఫోటోషూట్‌లో ప్రగ్యా గోల్డ్ కలర్ స్లీవ్‌లెస్ టైట్ డ్రెస్‌లో మెరిసిపోతూ హాట్ హంగామా సృష్టించింది. సింపుల్ యాక్సెసరీస్‌తోనే స్టైలిష్ లుక్‌ను ప్రెజెంట్ చేస్తూ, చిన్న ఈయర్‌రింగ్స్, గోల్డ్ హైహీల్స్‌తో తన అవుట్‌ఫిట్‌ను మరింత హైలైట్ చేసింది. హెయిర్ స్టైలింగ్ కూడా ఆమె లుక్‌కు అదనపు ఆకర్షణగా నిలిచింది. వివిధ యాంగిల్స్‌లో ఇచ్చిన పోజులు, కాన్ఫిడెంట్ ఎక్స్‌ప్రెషన్స్‌తో ప్రగ్యా మరోసారి తన గ్లామర్ పవర్‌ను చూపించింది. ఈ ఫోటోలలో ఆమె అందం, స్టైల్ కలిసి అభిమానులను కట్టిపడేస్తున్నాయి. ప్రస్తుతం ఈ పిక్స్ సోషల్ మీడియాలో వేగంగా వైరల్ అవుతూ, నెటిజన్ల నుంచి భారీ స్పందనను అందుకుంటున్నాయి. గోల్డ్ లుక్‌లో ప్రగ్యా చూపించిన ఈ గ్లామర్ షో, ఆమె ఫ్యాన్స్‌కు మరో విజువల్ ట్రీట్‌గా మారింది.

PRINTED, PUBLISHED and OWNED BY **G.THIRUPATHI,** PRINTED AT **SRK PRINTERS,** (V) KOKKERAKUNTA, RAMADUGU MANDAL, KARIMNAGAR DIST. 505001, TELANGANA, PUBLISHED FROM H.NO.10-6-219, KISAN NAGAR, KARIMNAGAR 505001, TELANGANA, **RNI NO.TELTEL/2006/69862,** EDITOR: **BANDARI MARUTHI**